క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్ కృష్ణాష్టమి శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం శుభాకాంక్షలు తెలిపారు. 'మానవాళికి కర్తవ్యబోధ చేసిన భగవద్గీత.. సన్మార్గానికి కలకాలం అండగా ఉంటుంది. అటువంటి భగవద్గీతను ప్రసాదించిన భగవాన్ శ్రీకృష్ణుడి పుట్టినరోజు అందరికీ పర్వదినం. ప్రపంచానికి గీతను బోధించి, ప్రేమ తత్వాన్ని పంచిన శ్రీకృష్ణుని కృపా కటాక్షాలు మనందరిపై సదా ఉండాలని కోరుకుంటున్నాను' అని సీఎం పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి నాయీ బ్రాహ్మణుల కృతజ్ఞతలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, నాయీ బ్రహ్మణ సేవా సంఘం ప్రతినిధులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణులను, వారి సామాజిక వర్గాన్ని కించపరిచే కొన్ని పదాలపై ప్రభుత్వం నిషేధం విధిస్తూ జీవో జారీ చేయడంపై వారు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం వారు ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. తమ ఆత్మగౌరవాన్ని కాపాడారంటూ వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎంను కలిసిన వారిలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ జేఏసీ అధ్యక్షుడు జి.రామదాసు, కె.శ్రీదేవి, నందిని తదితరులు ఉన్నారు.


ఐఏఎఫ్‌లోకి మెడ్‌టెక్ జోన్ ప్రవేశం

సాక్షి, విశాఖపట్నం: ఇంటర్నేషనల్ అక్రిడేషన్ ఫోరమ్ (ఐఏఎఫ్)లో ఏపీ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) ప్రవేశించింది. మెడ్‌టెక్ జోన్ తమ అసోసియేషన్ మెంబర్‌గా సభ్యత్వం పొందినట్లు ఐఏఎఫ్ గురువారం ప్రకటించింది. దేశం నుంచి ఐఏఎఫ్ అసోసియేషన్ మెంబర్‌గా అర్హత సాధించిన తొలి టెక్నాలజీ క్లస్టర్‌గా మెడ్‌టెక్ జోన్ నిలిచింది. ప్రపంచంలో వ్యాపార వాణిజ్య అవసరాలకు సహకారం అందిస్తూ.. ఎలాంటి రిస్క్ లేకుండా వాణిజ్య వృద్ధిని పెంపొందించేందుకు ఎగుమతి దిగుమతుల్లో ఐఏఎఫ్ సహకారం అందించనుంది.

ఫేక్ బాబుపై చర్యలు తీసుకోవాల్సిందే

- మాజీ మంత్రి పేర్ని నాని డిమాండ్

సాక్షి, అమరావతి: రాజకీయాల కోసం వ్యవస్థలను దిగజార్చే చంద్రబాబు చివరకు అశ్లీలాన్ని కూడా ఫేక్ వీడియోల ద్వారా వాడుకోవడమే కాకుండా తన దిగజారుడు రాజకీయాల కోసం అమెరికా సంస్థలను కూడా అడ్డగోలుగా వాడుకుంటూ దొరికిపోయారని మాజీ మంత్రి పేర్ని నాని దుయ్యబట్టారు. ఒక వెనుకబడిన వర్గానికి చెందిన ఎంపీ పేరు మీద అశ్లీల వీడియోను సృష్టించి, దాన్ని ఎల్లో మీడియా ద్వారా ప్రసారం చేసి.. దిగజారుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం చంద్రబాబుకు ఏమొచ్చిందని ప్రశ్నించారు. తప్పుడు వీడియోలు సృష్టించి, వాటిని ప్రచారం చేసిన చంద్రబాబు, లోకేశ్‌తో పాటు ఎల్లో మీడియాపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు నాయుడుకు దేవుడు సిగ్గు అన్నది ఇవ్వడం మర్చిపోయినట్లున్నారని, అందుకే సిగ్గు, శరం ఏమాత్రం లేకుండా రాజకీయాల కోసం ఏదిపడితే అది మాట్లాడించడం, ప్రచారం చేయడం అలవాటుగా మారిందన్నారు. గురువారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పేర్ని నానిఇంకా ఏమన్నారంటే..



పోతిని ప్రసాద్ ఎవరు?

- టీడీపీకి చెందిన నిఖార్సైన ఒకావిడ మాట్లాడుతూ.. ఈ సర్టిఫికెట్ కూడా కమ్మోళ్లు ఇచ్చారా అంటూ ఎకసెక్కాలు ఆడింది. మరి, ఈ సర్టిఫికెట్ ఇచ్చింది కమ్మోళ్లే కదా! పోతిని ప్రసాద్ కమ్మే కదా? ఇతను ఎవరు? ఆయన ఎవరికి సోదరుడు, ఆయనకు ఏం పని? మీకంత దమ్ము ఉంటే చంద్రబాబు నాయుడే ఎక్లిప్స్ సంస్థకు లేఖ రాయొచ్చు కదా? దొంగలతో ఈ పనులు చేయించడం ఎందుకు? ఇంతకూ పోతిని ప్రసాద్ ఎవరో చంద్రబాబు సమాధానం చెప్పాలి.
- 'పోతిని ప్రసాద్ అనే వ్యక్తి సో అండ్ సో ఐడీతో నాకు ఒక వీడియో పంపించాడు. వీడియోలో ఉన్నది మరో ఫోన్‌కాల్‌తో రికార్డు చేసిన వీడియో. అది ఒరిజినలా? కాదా? అని అడిగారు. ఒక ఫోన్‌లో ఉన్న వీడియోను మరో ఫోన్ ద్వారా రికార్డు చేసిన వీడియో ఒరిజినల్ అని చెప్పాను. ఆ రిపోర్టును మార్చి ఇవ్వాలని అడిగాడు. నేను ఆలోచించుకునేలోపే దానిని మార్చి బయటకు వైరల్ చేశారు. నేను ఇచ్చినట్టు ప్రచారం అవుతున్న సర్టిఫికెట్ ఒరిజినల్ కాదు. అది ఎడిట్ చేసిన దొంగ సర్టిఫికెట్' అని ప్రొఫెసర్ జిమ్ స్టాఫర్డ్ స్పష్టంగా మెయిల్ చేశారు. దీనిపై టీడీపీ స్పందన ఏంటి?

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి..

- ఫేక్ వీడియోను తయారు చేసినందుకు టీడీపీని, పోస్ట్ చేయించినందుకు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లను, నిజ నిర్ధారణ చేయకుండా అశ్లీల వీడియోను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేసినందుకు, పదేపదే ఈ అశ్లీలాన్ని చూడలేక ప్రజలు అల్లాడిపోయే వరకు ప్రసారం చేసిన టీడీపీ అనుకూల టీవీ చానళ్లను, ఆ చానళ్ల యాజమాన్యాలను, దొంగ వీడియోలు చూపించి ఫేక్ రిపోర్టులు చూపిస్తూ ప్రెస్‌మీట్ పెట్టిన టీడీపీ నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరుతోంది.
- ఆ రిపోర్టు తాము ఇవ్వలేదని, అది అబద్ధమని అమెరికా సంస్థే చెబుతున్నప్పుడు టీడీపీ, ఎల్లో మీడియాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పార్టీ తరఫున ఫిర్యాదు చేయాలనుకుంటున్నాం.
- టీడీపీ, చంద్రబాబు, లోకేష్, పట్టాభి, అనిత... వీరంతా కుట్ర పూరితంగా అమెరికా సంస్థను అడ్డం పెట్టుకుని తప్పుడు ప్రచారం చేయడం వాస్తవమా? కాదా? నివేదికను ట్యాంపర్ చేయించడం చంద్రబాబు చేసిన నేరం కాదా?

పవన్.. పాచిపోయిన లడ్డూ రుచి చూపించావా?

- పవన్ కల్యాణ్ మాటకు నిబద్ధత లేదు. పూటకో మాట, రోజుకో వేషం. పవన్ కల్యాణ్ వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం చేకూరింది?
- ఎన్నికల ముందు మోదీని తిట్టావు. మళ్లీ మోదీ చంకనెక్కావు. ఏ రాజకీయ అవసరం కోసం? మోదీకి ఏమైనా పాచిపోయిన లడ్డూ రుచి చూపించావా? మళ్లీ కొత్తగా లడ్డూ వండించావా? ఆ రోజు 11 రోజులు అన్నం తినలేదన్నావు కదా? మరచిపోయావా?
- పవన్ లాంటి విద్యార్థి.. స్కూల్‌లో ఏ వ్యాసం రాయమన్నా.. ఆవు కథ రాసినట్టు.. అధికారంలో ఉన్నా జగన్‌నే.. లేకపోయినా జగన్‌నే తిట్టడం ఎవరి కోసం?

ఏఐబీపీ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయండి

- కేంద్ర జలశక్తి శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ) కింద కేంద్ర ఆర్థిక సాయంతో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు కేంద్ర జలశక్తి శాఖ సూచించింది. ప్రాజెక్టులు, వాటి కింద కాల్వల పనులను నూరు శాతం పూర్తి చేసేందుకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేసింది. గురువారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ వివిధ రాష్ట్రాల అధికారులతో ఢిల్లీ నుంచి సమీక్ష నిర్వహించారు. ఏపీలోని గుండ్లకమ్మ, తోటపల్లి, తాడిపూడి, పుష్కర, ఎర్రకాల్వ ప్రాజెక్టుల పనులపై సమీక్షించారు. ముఖ్యంగా వంద ఎకరాల్లోపే భూసేకరణ పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులపై దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఇటీవల వర్షాల వల్ల పనులకు ఆటంకం ఎదురైందని.. కొన్నింటిని మార్చి నాటికి, మిగతావి జూన్ నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర అధికారులు తెలిపారు.

చంద్రబాబు దర్శకత్వం.. టీడీపీ సమర్పణలో..

ది డర్టీ పిక్చర్..!

▶ మొదటి పేజీ తరువాయి

వైఎస్సార్ కాంగ్రెస్‌పై బురద జల్లటానికి ఆఖరికి అమెరికాకు చెందిన ఫోరెన్సిక్ ల్యాబ్‌ను కూడా తప్పుదోవ పట్టించారని ఆ సంస్థే స్వయంగా వెల్లడించింది. ఆ బూతు వీడియో కాల్‌ను ఒరిజినల్ మాదిరిగా మార్ఫింగ్ చేయడానికి చంద్రబాబు నాయుడి టీమ్ ఎంతగా కృషి చేసిందో సదరు ఫోరెన్సిక్ ల్యాబ్ అధిపతి జిమ్ స్టాఫర్డ్ స్వయంగా వివరిస్తూ ఏపీ సీఐడీకి లేఖ రాశారు. ఈ విషయాన్ని సీఐడీ అదనపు డీజీ సునీల్‌కుమార్ మీడియాకు వెల్లడించారు. లేఖలోని వివరాల ప్రకారం టీడీపీ నేతలు ఈ బూతు చిత్రాన్ని ఎలా సమర్పించారంటే...

మొదట్లో ఓ వీడియోను తీసుకున్నారు. చంద్రబాబు నాయుడి దర్శకనిర్మాణంలో దాన్ని ఎడిట్ చేసి, మార్ఫింగ్ చేసి... అనంతపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌ను దెబ్బతీసేలా... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురద జల్లటానికి పనికివచ్చేలా తమకు కావలసినట్లు మార్చుకున్నారు. దీన్ని ఒక ఫోన్‌లో ప్లే చేస్తూ... ఆ ఫోన్లో ప్లే అవుతున్న వీడియోను మరో ఫోన్ ద్వారా ఎలాంటి అంతరాయాలూ లేకుండా షూట్ చేశారు. ఎందుకంటే అలా షూట్ చేసినపుడు అందులో మధ్యలో ఆగటం, ఎడిట్ చేసినట్లు కనిపించటం వంటివేమీ ఉండవు. ఇదిగో... ఇలా షూట్ చేసిన వీడియోను తమ పార్టీకి చెందిన ప్రసాద్ పోతిని అనే వ్యక్తి ద్వారా అమెరికాలోని ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆ ల్యాబ్.. తనకు పంపిన వీడియోను చూసింది. ''మేం చూసిన వీడియో ఒరిజినలే. కాకపోతే దాన్ని ఒక ఫోన్లో ప్లే చేస్తుండగా మరో ఫోన్ కెమెరా ద్వారా షూట్ చేశారు. అలా షూట్ చేసిందే మాకు పంపించారు. మా చేతికి ఏదైతే వచ్చిందో అందులో ఎలాంటి ఎడిటింగ్ జరగలేదు'' అని తమ నివేదికలో జిమ్ స్టాఫర్డ్ స్పష్టంగా పేర్కొన్నారు. అయితే తమకు అందిన దాని గురించే తాము చెప్పామని... తమకు ఒరిజినల్ వీడియో పంపించినట్లు తాము చెప్పలేదని, మార్ఫింగ్ చేసి... ఎడిట్ చేసిన వీడియోను ఒక ఫోన్లో ప్లే చేస్తూ... దాన్ని వేరే ఫోన్‌తో షూట్ చేసి ఉండొచ్చని స్టాఫర్డ్ స్పష్టంగా చెప్పారు కూడా. నిజానికి అనంతపురం ఎస్పీ ఫక్కీరప్ప చెప్పింది కూడా ఇదే. వైరల్ అవుతున్న వీడియో ఒరిజినల్ కాదని!!.



మాట్లాడుతున్న సీఐడీ అదనపు డీజీ పీవీ సునీల్ కుమార్

మెయిల్‌ను మార్చమని అడిగిన టీడీపీ..

నిజానికి ఎక్లిప్స్ ఫోరెన్సికల్ ల్యాబ్ చెప్పినదాంట్లో టీడీపీకి అనుకూలమేమీ లేదు. దీంతో ల్యాబ్ హెడ్ జిమ్ స్టాఫర్డ్‌ను ప్రసాద్ పోతిని సంప్రదించారు. తమకు పంపిన మెయిల్‌ను కాస్త మార్చాలని అడిగారు. దానికి స్టాఫర్డ్ వెంటనే సమాధానమివ్వలేదు. ఈలోగా చంద్రబాబు నాయుడి టీమ్ ఆ పని చేసేసింది. మెయిల్‌ను ట్యాంపర్ చేసేసింది. జిమ్ స్టాఫర్డ్ ఇచ్చిన నివేదికలో కొన్ని పదాలను తొలగించేసి... అది ఒరిజినల్ వీడియో అంటూ అమెరికన్ ల్యాబ్ ధ్రువీకరించిందని, ఇంకా ఏం సాక్ష్యాలు కావాలంటూ యావత్తు తెలుగుదేశం బృందం ఎక్కడికక్కడ మీడియా ముఖంగా ఆక్రందనలు మొదలెట్టింది. షరా మామూలుగా ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 తదితర బాబు బాకా మీడియా సంస్థలు దీన్ని బ్రహ్మాండం బద్దలైపోయినట్లుగా... ''అమెరికా సంస్థే తేల్చింది'' అంటూ పతాక శీర్షికల్లో వండి వార్చేశాయి.

ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా నిజాన్ని ఎన్నాళ్లు దాచగలరు? అందుకే ఈ వ్యవహారంలో మీరేం చెప్పారు? అది ఒరిజినల్ వీడియో అని చెప్పారా? అని అడిగిన సీఐడీకి... ఎక్లిప్స్ ల్యాబొరేటరీస్ లేఖ పంపింది. అందులోని నిర్ఘాంతపోయే నిజాలతో... తెలుగుదేశం పార్టీ నిర్మించి సమర్పించిన డర్టీ పిక్చర్ వ్యవహారం బయటపడింది. అంతే కాదు!! తమ నివేదికను ట్యాంపర్ చేసిన ప్రసాద్ పోతిని పైన, ఆ నివేదికను ప్రచారంలోకి తీసుకువచ్చిన వారిపైన చర్యలు కూడా తీసుకుంటామని జిమ్ స్టాఫర్డ్ చెప్పటం... ఈ వ్యవహారంలో చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని చెప్పాలి.

ఆర్‌ఆర్‌ఆర్‌లోని సీన్‌ను రికార్డు చేస్తే...

ఓ చిన్న ఉదాహరణ చూస్తే పై సంఘటనకు అతికినట్లు సరిపోతుంది.

- ఇటీవల వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ఓ సీన్‌లో పులులు, సింహాలు, ఎలుగుబంట్లు ఓ వ్యాన్ నుంచి దూకినట్లుగా చూపిస్తారు. అవి నిజమైన పులులు, సింహాలు కావు. గ్రాఫిక్స్ ద్వారా నిజమేననే భ్రమ కలిగించేలా చేశారు. ఆ సినిమాను థియేటర్‌లో ప్రదర్శిస్తుంటే ఎవరైనా నిజమే అనుకుంటారు. మరి అలా తెరపై ప్లే అవుతున్న సినిమాను తమ మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి... ఆ వీడియోను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారనుకోండి. ఆ సీన్‌లో ఉన్నవి నిజమైన పులులు, సింహాలో కాదో చెప్పమన్నారనుకోండి. ఆ ల్యాబ్ ఏం చేస్తుంది?
- ఆ మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసిన క్లిప్ (తమకు వచ్చినది) మాత్రమే ఒరిజినల్ అని ఏ ల్యాబైనా చెబుతుంది. సినిమా థియేటర్లో తెరపైన ప్రదర్శించిన సీన్‌లో ఉన్న పులులు, సింహాలు నిజమైనవో కావో ఆ వీడియోను చూసి ఏ ఫోరెన్సిక్ ల్యాబ్ కూడా చెప్పలేదు. అలా చెప్పాలంటే ఆ సినిమా డిజిటల్ రీల్‌ను ఫోరెన్సిక్ సంస్థకు పంపించాలి. ప్రస్తుతం ఎంపీ మాధవ్ పేరుతో కొందరు వైరల్ చేసిన వీడియో క్లిప్ కూడా అలాంటిదే.

ఇదండీ... జరిగిన కథ

- ఓ పురుషుడు, ఓ మహిళ సంభాషణకు సంబంధించిన వీడియో కాల్ ఒక ఫోన్లో ప్లే అవుతుండగా... దాన్ని మరో వ్యక్తి తన మొబైల్ ఫోన్ ద్వారా రికార్డ్ చేశారు. ఆ వీడియోలో ఉన్నది ఎంపీ గోరంట్ల మాధవ్ అనే అభియోగాలు మోపారు. కానీ తాను ఆ వీడియోలో ఉన్నట్టుగా కొందరు మార్ఫింగ్ చేశారని ఎంపీ మాధవ్ చెప్పారు.
- మీడియాలో ప్రసారమైన ఆ వీడియోను ప్రసాద్ పోతిని అనే వ్యక్తి అమెరికాలోని ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి.. ఆ వీడియో ఒరిజినలే అని ఆ ల్యాబ్‌కు చెందిన జిమ్ స్టాఫర్డ్ ధ్రువీకరించినట్టుగా ఓ సర్టిఫికెట్‌ను మరికొందరితో కలసి మీడియాలో వైరల్ చేశారు.
- ఈ అంశంపై అమెరికాలోని ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ల్యాబ్‌ను సీఐడీ విభాగం సంప్రదించగా.. జిమ్ స్టాఫర్డ్ స్పందిస్తూ... ఆ వీడియో ఒరిజినల్ అని తాము ధ్రువీకరించలేదన్నారు. తమకు పంపిన వీడియో క్లిప్‌ను మాత్రమే ఒరిజినల్ అన్నామని, దానికి మాతృక అయిన వీడియోను తాము ధ్రువీకరించలేదని... ఈ మేరకు ఎలాంటి నివేదికా ఇవ్వలేదని స్పష్టంగా చెప్పారు. ఆ అసలైన వీడియో క్లిప్ పంపితేనే అది ఒరిజినలో కాదో చెప్పగలమని కూడా ఆ సంస్థ ప్రసాద్ పోతినికి స్పష్టం చేసింది.

ట్యాంపర్ చేసిన నివేదికతో దుష్ప్రచారం

- ఎక్లిప్స్ ఫోరెన్సిక్ ఇచ్చిన నివేదికతో ప్రసాద్ పోతిని సంతృప్తి చెందలేదు. తాము ఆశించినట్టుగా ఆ వీడియో ఒరిజినలే అని నివేదిక ఇవ్వాలని జిమ్ స్టాఫర్డ్‌ను కోరారు. దానికి ఆయన సానుకూలంగా స్పందించలేదు. దీంతో ఎక్లిప్స్ ల్యాబ్ ఇచ్చిన నివేదికను ప్రసాద్ పోతిని ట్యాంపర్ చేశారు. అలా మార్చిన నివేదికను ఆయనతోపాటు కొందరు మీడియాలో వైరల్ చేశారు. అయితే ఆ సర్టిఫికెట్ తాము జారీ చేసింది కాదని జిమ్ స్టాఫర్డ్ ఏపీసీఐడీకి మెయిల్ ద్వారా తెలిపారు.
- వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారానికి ఇలా తప్పుడు నివేదికను ప్రచారంలోకి తేవటంపై సీఐడీ అధికారి సునీల్ కుమార్ స్పందిస్తూ... ''ఏదైనా సంస్థ ఇచ్చిన సర్టిఫికెట్‌ను యథాతథంగా వెల్లడించాలి. అంతేగానీ అందులో మార్పులు చేయడం చట్ట ప్రకారం నేరం. అందుకు బాధ్యులైన వారిపై ఐటీ చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం అని సీఐడీ ఏడీజీ సునీల్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగుల క్రమశిక్షణ వ్యవహారాల ట్రిబ్యునల్ రద్దు

ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సివిల్ సర్వీసెస్ అధికారుల క్రమశిక్షణ వ్యవహారాల ట్రిబ్యునల్‌ను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ చట్టాన్ని రద్దు చేయడం ద్వారా ఇప్పటికే తీసుకున్న చర్యలపై ఎటువంటి ప్రభావం ఉండదని, ప్రస్తుతం విచారణలో ఉన్న కేసులను ఏపీ విజిలెన్స్ కమిషన్‌కు బదలాయిస్తామని జీఏడీ కార్యదర్శి (సర్వీసెస్, హెచ్‌ఆర్‌ఎం) తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న ట్రిబ్యునల్ కార్యాలయాన్ని మూసివేసి అక్కడ ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్స్ వంటి ఇతర సామగ్రిని వెలగపూడిలోని రిజిస్ట్రార్ కమిషనర్ ఆఫ్ ఎంక్వైరీస్‌కు తరలించాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీడీపీ పెద్ద ఫేక్

మంత్రి జోగి రమేష్ మండిపాటు



కొత్తపేట: 'తెలుగుదేశం పార్టీ పెద్ద ఫేక్.. ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఫేక్.. అలాంటి బాబుకు ఫేక్ ప్రచారం చేయడం అలవాటే' అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. ఎంపీ గోరంట్ల మాధవ్ వీడియో ఫేక్ అయినప్పటికీ, అది ఒరిజినల్ అంటూ.. అమెరికాలోని ఓ ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టు ఇచ్చిందంటూ టీడీపీ దుష్ప్రచారం చేస్తుండటంపై తీవ్రంగా మండిపడ్డారు. గురువారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన టీడీపీ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. గోరంట్ల మాధవ్ ఫేక్ వీడియోను పట్టుకుని.. ఒక ఫేక్ సర్టిఫికెట్ సృష్టించుకుని గవర్నర్ దగ్గరకు వెళ్లటం దారుణం అని చెప్పారు. 'వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేవు కాబట్టి ఇలాంటి ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం చేయడం టీడీపీకి అలవాటుగా మారింది. అది ఒరిజినల్ కాదని అమెరికాలోని ఆ ఫోరెన్సిక్ ల్యాబ్ వారే స్వయంగా ఈ మెయిల్ ద్వారా తెలిపారు. చంద్రబాబు, టీడీపీ నేతలపై తగు చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరుతున్నాం' అని తెలిపారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు ఏవిధంగా టీడీపీకి ఫేక్ అధ్యక్షుడయ్యారో అందరికీ తెలుసని చెప్పారు.

బాబు జీవితమంతా గ్రాఫిక్సే

- నాడు అమరావతిపై.. నేడు వైఎస్సార్‌సీపీ నాయకులపై..
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



సాక్షి, అమరావతి/రాజమహేంద్రవరం: నాడు టీడీపీ అధికారంలో ఉండగా రాజధాని అమరావతిపై గ్రాఫిక్స్ సృష్టించిన చంద్రబాబు నేడు వైఎస్సార్‌సీపీ నాయకులపై గ్రాఫిక్స్ సృష్టిస్తూ ప్రజల్లో అలజడి సృష్టిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. ఆయన జీవితమంతా గ్రాఫిక్సేనని ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంపీ గోరంట్ల మాధవ్‌పై ఫేక్ వీడియో రూపొందించింది టీడీపీనేనని ఇప్పుడు తేటతెల్లమైందని స్పష్టం చేశారు. కుట్ర రాజకీయాలకు చంద్రబాబు దేశంలోనే ఒక చిరునామా అని తెలిపారు. నాడు ఎన్టీ రామారావును సీఎం పదవి నుంచి దింపడం కోసం లక్ష్మీపార్వతిని సాకుగా చూపి కుట్ర చేశారన్నారు. ప్రతి ఒక్కరిని మోసం చేసి, ఎదగాలనుకోవడం చంద్రబాబు నైజం అని ధ్వజమెత్తారు. 'ఎంపీ మాధవ్‌పై టీడీపీ వారే ఒక ఫేక్ వీడియో రూపొందించారు. వారే విదేశాలకు పంపి అప్‌లోడ్ చేశారు. ఆ తర్వాత సోషల్ మీడియాలో వైరల్ చేసి, వారే ట్రోల్ చేశారు' అని మండిపడ్డారు. ఇందుకు కారకులైన టీడీపీ నేతలందరిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

టీడీపీ కుట్ర బట్టబయలు

- ఫేక్ సర్టిఫికెట్‌తో దొరికిపోయిన బాబు అండ్ గ్యాంగ్: మంత్రి కారుమూరి



తణుకు అర్బన్: ఆ ఫోరెన్సిక్ రిపోర్టు తాను ఇచ్చింది కాదని అమెరికాలోని ల్యాబ్‌కు చెందిన జిమ్ స్టాఫర్డ్ స్వయంగా స్పష్టం చేయడంతో టీడీపీ కుట్ర బట్టబయలైందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. రిపోర్టును మార్చడానికి ఆయన సమ్మతించక పోవడంతో ఏకంగా సర్టిఫికెట్‌నే మార్చడం టీడీపీ దుర్మార్గ రాజకీయాలకు నిదర్శనమన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను ఇబ్బంది పెట్టారని ఏ మహిళా.. ఎటువంటి ఫిర్యాదు చేయకపోయినా ఒక మార్ఫింగ్ వీడియోతో చంద్రబాబు అండ్ కో నీచ రాజకీయాలకు తెరతీశారని దుయ్యబట్టారు. సాంకేతికతను ఉపయోగించుకుని కుట్రలకు తెరతీయడంలో దిట్ట అయిన చంద్రబాబు, లోకేశ్ గ్యాంగ్ ఎంతటి నీచానికైనా ఒడిగడతారని మండిపడ్డారు. తప్పుడు రిపోర్ట్‌తో దొరికిపోయిన బాబు అండ్ గ్యాంగ్‌పై చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆ వీడియో చూశామని టీడీపీకి చెందిన కొందరు మహిళలు సభ్యత మరచి.. అడ్డగోలుగా మాట్లాడుతుండడం పట్ల సభ్య సమాజం తల దించుకుంటోందని అన్నారు. మహిళలతో అశ్లీల నృత్యాలు చేస్తున్న లోకేశ్ చిత్రాలు చూసి కూడా ఏమీ మాట్లాడని చంద్రబాబు అండ్ కోను ఏమనుకోవాలని నిలదీశారు.

బాబు, ఎల్లో మీడియా సెల్ఫ్ గోల్

- ఫేక్ వీడియో వ్యవహారంపై మాజీ మంత్రి కొడాలి నాని
- మహిళలను అడ్డుపెట్టుకుని చంద్రబాబు నీచ రాజకీయాలు
- పదవులేమో మీ కులపోళ్లకు.. అశ్లీలతపై మాట్లాడేందుకు దళితులా?

సాక్షి, అమరావతి: ఎంపీ మాధవ్‌పై ఫేక్ వీడియో, ఫేక్ సర్టిఫికెట్‌తో చంద్రబాబుతో పాటు ఎల్లో మీడియా సెల్ఫ్ గోల్ చేసుకుందని మాజీ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరావు(నాని) అన్నారు. మహిళలను అడ్డుపెట్టుకుని చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు టీడీపీ నేతలు ప్రతి రోజూ ఏదో ఒక కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కుల, మతాల పేరుతో చంద్రబాబు చిచ్చు పెట్టాలని చూస్తున్నారన్నారు. ఆయనకు తోడు ఎల్లో మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. మాధవ్ వీడియోపై ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, ప్రభుత్వంపై బురద చల్లేందుకు టీడీపీ పనికిమాలిన రాజకీయాలు చేస్తోందని నిప్పులు చెరిగారు. నాని ఇంకా ఏమన్నారంటే..



బాబు ఫేక్ రాజకీయం

- ఎంపీ గోరంట్ల మాధవ్ పేరుతో సర్క్యులేట్ అవుతున్న వీడియో వ్యవహారంలో.. అమెరికాలోని ఎక్లిప్స్ లేబరేటరి నుంచి టీడీపీ వారు ఒక ఫేక్ నివేదిక తీసుకొచ్చి హడావుడి చేశారు. తీరా అది ఫేక్ అని, ఆ విషయం ఎక్లిప్స్ లేబొరేటరీ చీఫే ఈ మెయిల్ ద్వారా వెల్లడించినట్టు సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ స్పష్టంగా చెప్పారు.
- సీఎం జగన్‌ను ప్రజా క్షేత్రంలో ఎదుర్కోలేక, ఆయన అమలు చేస్తోన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుండటాన్ని జీర్ణించుకోలేక ఏదో రకంగా బురద చల్లాలనే టీడీపీ పన్నాగం బట్టబయలైంది.
- చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, టీడీపీని మోస్తున్న ఎల్లో మీడియా.. సీఎం జగన్‌పై ప్రతి క్షణం విషం కక్కుతూ, ఎలాగైనా చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలని, తద్వారా, రాష్ట్రాన్ని లూటీ చేసి, వీళ్ల కుటుంబాల ఆస్తులు పెంచుకోవాలని పదే పదే కుట్రలు చేస్తున్నారు.
- సీఎం జగన్ క్రిస్టియన్ అని, డీజీపీ, హోం మంత్రి, ఎస్పీలు క్రిస్టియన్లు అని, కాబట్టే రాష్ట్రంలో దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని.. వీళ్లే దాడులు చేయించి, వీళ్లే మతాల గురించి మాట్లాడి ఈ ప్రభుత్వంపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారు. కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ పేరు పెడితే.. ఒక దళిత మంత్రి, ఒక బీసీ ఎమ్మెల్యే ఇళ్లపై దాడులు చేసి, ఆఖరికి కోనసీమలో కులాల మధ్య, మతాల మధ్య చంద్రబాబు అండ్ కో చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారు.

అశ్లీలం గురించి మాట్లాడేందుకు వారే కనిపించారా?

- టీడీపీలో పదవులేమో చెందిన కమ్మ కులం వారికి ఇస్తారు. కృష్ణా జిల్లా విషయానికొస్తే.. అక్కడ జెడ్పీ చైర్మన్ పదవిని కమ్మ వర్గానికి చెందిన గద్దె అనురాధకు.. మేయర్ పదవేమో బాబు సామాజిక వర్గానికి చెందిన చెందిన కేశినాని నాని కూతురికి అని చెప్పాడు. అశ్లీల వీడియోల గురించి మాట్లాడాల్సి వస్తే మాత్రం దళిత మహిళలు అనిత, గ్రీష్మలే కనిపిస్తారా?

ఫేక్ రిపోర్ట్.. ఫేక్ పార్టీ.. ఫేక్ లీడర్

- ఫేక్ వీడియోతో టీడీపీ అనైతిక రాజకీయం
- ఎమ్మెల్సీ పోతుల సునీత

సాక్షి, అమరావతి: టీడీపీ సిగ్గు, ఎగ్గు లేకుండా ఫేక్ వీడియోలు, ఫేక్ సర్టిఫికెట్‌లతో అనైతిక రాజకీయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజమెత్తారు. ఆ పార్టీ ఫేక్ అని, దాని అధ్యక్షుడు చంద్రబాబు కూడా ఫేక్ అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పాలన చూసి కడుపు మంటతో టీడీపీ దుష్ట రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీ మాధవ్‌పై ఫేక్ వీడియో రూపొందించి, దుష్ప్రచారం చేసిన, సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ నాయకులు అనిత, పట్టాభి.. ఫేక్ వీడియోలను పదేపదే ప్రసారం చేసిన ఎల్లోమీడియా చానళ్లు, పత్రికలపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ఎవరికీ చుట్టం కాదని, తన పని తాను చేసుకుపోతుందనే విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..

మనుగడ కోసం టీడీపీ నీచ రాజకీయం

- ఇలాంటి ఫేక్ వీడియోలతో రాజకీయాలు సాధ్యం కాదని టీడీపీ ఇప్పటికైనా గుర్తించాలి. సీఎం జగన్ ఏపీని దేశంలోనే ఉన్నత స్థానంలో నిలిపారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆదరణ కోల్పోయిన టీడీపీ.. మనుగడ కోసం ఫేక్ వీడియోలు, మార్ఫింగ్ వీడియోలతో నీచ రాజకీయం చేస్తోంది.



- టీడీపీ వారే ఫేక్ వీడియో సృష్టించి, దాన్ని లండన్‌కు పంపి, టీడీపీకి చెందిన ఐ టీడీపీ గ్రూప్ ద్వారా దాన్ని అప్‌లోడ్ చేసి, సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఆ తర్వాత ఆ వీడియోను అమెరికాలోని ఒక ల్యాబ్‌కు పంపామని, ఆ వీడియో వాస్తవమని నివేదిక వచ్చిందని రచ్చ చేశారు. తీరా ఆ నివేదిక తాము ఇవ్వలేదని సదరు ల్యాబ్ వారు స్పష్టం చేయడంతో టీడీపీ బండారం బయట పడింది.
- తద్వారా రాష్ట్రంలో టీడీపీ ఏ స్థాయిలో దుర్మార్గమైన రీతిలో రాజకీయం చేస్తోందన్నది అందరికీ అర్థమైంది. చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలు, కుతంత్రాలే. ఎప్పుడూ ఎవరో ఒకరితో పొత్తు పెట్టుకుని రాజకీయాలు చేశారు. ఇప్పుడు మళ్లీ బీజేపీ ప్రాపకం కోసం వెంపర్లాడుతున్నాడు.
- రాష్ట్రంలో మహిళలు ఉన్నారని కూడా చూడకుండా, ఒక బీసీ నేత, స్వయంగా ఎంపీపైనే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ విధంగా సీఎం జగన్‌పై నిందలు మోపుతున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. పిచ్చిపిచ్చిగా మాట్లాడిన అనిత, పట్టాభిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి.

దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ సహాయమే అర్థిస్తున్నాము. మాకు రుజు మార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయి దారితప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహానికి పాత్రులయినవారి మార్గమే మాకు చూపించు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, ఆగస్టు, 19

టీమ్ కమలం - 2024

యుద్ధం సమీపిస్తున్నప్పుడు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోవాల్సిందే! వరుసగా మూడోసారి ఢిల్లీ గద్దెనెక్కాలనే ముమ్మర ప్రయత్నంలో ఉన్న బీజేపీ ఇప్పుడు ఆ పనే చేస్తోంది. రానున్న 2024 ఎన్నికల దృష్ట్యా పార్టీలో భారీ సంస్థాగత మార్పులు చేపట్టింది. పార్టీలో అత్యున్నత విధాన నిర్ణాయక మండలిగా పేరున్న పార్లమెంటరీ బోర్డ్‌నూ, కేంద్ర ఎన్నికల కమిటీనీ బుధవారం పునర్వ్యవస్థీకరించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటించిన పేర్లు, ఈ పునర్వ్యవస్థీకరణ జరిగిన తీరు అటు సొంత పార్టీ వారికీ, ఇటు సామాన్య ఓటర్లకూ తగిన సంకేతాలిస్తోంది. నితిన్ గడ్కరీ, యోగి ఆదిత్యనాథ్ లాంటి వారికి చెక్‌పెడుతూనే, తక్షణ ఎన్నికల ప్రయోజనాలున్న చోట యడియూరప్ప లాంటి వారిని దువ్వడంలోనూ మోదీ – అమిత్ షాల ముద్రే కనిపిస్తోంది.

అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్, అనంతకుమార్ లాంటి వారి మృతి, వెంకయ్య నాయుడు తదితరుల నిష్క్రమణతో చాలాకాలంగా బోర్డులో 5 ఖాళీలున్నాయి. కొన్నేళ్ళుగా వాటి ఊసే వదిలేసి, మరో అయిదు నెలల్లో జనవరి 20తో నడ్డా పదవీకాలం ముగుస్తుందనగా భర్తీ చేయడం విచిత్రమే. పార్లమెంటరీ బోర్డులో పేరున్న సీనియర్లయిన కేంద్ర మంత్రి గడ్కరీ, మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌లకు ఇద్దరికీ ఉద్వాసన పలికారు. ఎన్నికల దృష్ట్యా ఎక్కడికక్కడ బలం పెంచుకోవాలని చూస్తున్న కమలనాథులు తెలంగాణకు చెందిన కె. లక్ష్మణ్ సహా కొత్తగా ఆరుగురికి స్థానం కల్పించారు. అలా బోర్డ్ సభ్యుల సంఖ్య 11కు చేరింది. ఓబీసీ (కె. లక్ష్మణ్, హరియాణా మాజీ ఎంపీ సుధా యాదవ్), ఎస్సీ (ఉజ్జయినీకు చెందిన కేంద్ర మాజీ మంత్రి సత్యనారాయణ జటియా), సిక్కు (జాతీయ మైనార్టీ కమిషన్ ఛైర్మన్ ఇక్బాల్‌సింగ్ లాల్‌పురా) – ఇలా వివిధ సామాజిక సమీకరణాలు, ఉత్తర– దక్షిణాదులతో పాటు ఈశాన్యం (గిరిజన నేత – కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్) – ఇలా భౌగోళిక లెక్కలు వేసుకొని మరీ ఈ మార్పులు చేశారనేది స్పష్టం.

బోర్డ్‌లోని 11 మందితో పాటు పార్టీ నామినేట్ చేసే ముగ్గురు, ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా మహిళా మోర్చా చీఫ్ ఉండే మొత్తం 15 మంది సభ్యుల పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)లోనూ మోదీ మార్కే! వివాదంలో ఇరుక్కున్న కేంద్ర మాజీ మంత్రి షానవాజ్ హుస్సేన్ సహా ముగ్గురు పాతవారికి స్వస్తి పలికారు. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్, ఓం మాథుర్‌లకు కొత్తగా చోటిచ్చారు. పార్టీలోని నలుగురు అగ్రశ్రేణి నేతల్లో ఒకరైన గడ్కరీకి బోర్డు నుంచి ఉద్వాసన ఒకింత ఆశ్చర్యకరమే. అయితే, పార్టీకి వరుస విజయాలు అందిస్తున్నంత కాలం సంఘ్ పరివార్ సైతం తమను కాదనదని మోదీ – షా ద్వయానికి తెలుసు. ఈ గుజరాతీ మిత్రులు పార్టీపై తమ పట్టు చూపడానికి పునర్వ్యవస్థీకరణను అంది పుచ్చుకున్నారు. ఆరెస్సెస్‌కు సన్నిహితుడూ, మితవాద ముఖచిత్రమైన గడ్కరీ ఎన్నికల రాజకీయాల పట్ల ఇటీవల ప్రకటించిన వైరాగ్యం, అభిప్రాయాలు అధినేతల్ని చీకాకు పరిచాయి. వ్యక్తుల కన్నా వ్యవస్థ, సిద్ధాంతమే గొప్పదని నిరూపించడానికి గడ్కరీని తప్పించారని ఓ విశ్లేషణ. పార్టీలో మార్పులు తెచ్చి, 2009 నాటికే అధ్యక్షుడైన గడ్కరీ ఇప్పుడు బోర్డ్‌కూ, సీఈసీకీ వెలుపలే మిగిలిన పరిస్థితి.

పార్టీలో ఆధిపత్యానికి అడ్డు లేకుండా మోదీ చూసుకున్నారు. తనను మించి ఎదుగుతున్నాడని పేరుపడ్డ యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు పార్టీలో బలం పెరగకుండా జాగ్రత్తపడ్డారు. ఆ మధ్య యూపీ ఎన్నికలు, రానున్న లోక్‌సభ ఎన్నికల రీత్యా ఆయనను సహిస్తూ వస్తున్నా, విధాన నిర్ణాయక మండలిలో చోటివ్వలేదు. ఎన్నికల రాజకీయాలకు స్వస్తి పలుకుతానని చెప్పిన కర్ణాటక మాజీ సీఎం యడియూరప్పను బోర్డులోకి తీసుకోవడం వెనుక వ్యూహం సుస్పష్టం. అంతర్గత కలహాలు, ఆరోపణల వల్ల సీఎం కుర్చీ వదులుకోవాల్సి వచ్చిన యడియూరప్ప కొన్నాళ్ళుగా పార్టీపై అలకబూనారు. లింగాయత్ ఓటుబ్యాంక్ ముఖ్యమైన కర్ణాటక ఎన్నికలు మరి 9 నెలల్లోనే ఉన్నాయి. బీజేపీ పాలిత ఏకైక దక్షిణాది రాష్ట్రంలో బలమైన ఈ లింగాయత్ నేతను దూరం చేసుకోవడం తెలివైనపని కాదని కమలనాథులకు తెలుసు. అందుకే కినుక వహించిన కురువృద్ధుడిని వ్యూహాత్మకంగా లాలించి, బుజ్జగించి ఇటు బోర్డులో, అటు సీఈసీలో చేర్చారు. 1989 తర్వాత ఏ పార్టీ వరుసగా రెండోసారి అధికారంలోకి రాని కర్ణాటకలో బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ఆయన కీలకం కానున్నారు.

ఇటీవల హైదరాబాద్‌లో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగినప్పుడే కొత్తవారిని ప్రోత్సహిస్తూ, రాగల పాతికేళ్ళకు సిద్ధం కావాలని పార్టీ పిలుపునిచ్చింది. అందుకు తగ్గట్లే ఇప్పుడు ఫడ్నవీస్, భూపేంద్ర యాదవ్ లాంటి కొత్త నేతలకు పార్టీలో ప్రాధాన్యం పెంచారనుకోవాలి. యువ రక్తం నింపే సాకుతో ఇదే అధినేతలు గతంలో అద్వానీ, మురళీమనోహర్ జోషీలను నామమాత్ర పార్టీ మార్గదర్శక్ మండలికే పరిమితం చేశారు. మరి ఇప్పుడు ఏడున్నర పదులు దాటిన యడియూరప్ప, జటియాలకు బోర్డ్‌లో ఎలా స్థానమిచ్చారంటే ఎన్నికల అవసరాలనే అనుకోవాలి. గడ్కరీకి బదులు అదే వర్గానికి చెందిన నాగ్‌పూర్ వాసి, ఆరెస్సెస్ సన్నిహితుడైన ఫడ్నవీస్‌కు సీఈసీలో చోటిచ్చి సమతూకం చేసేశారు. అయితే, ఆ మధ్య కేంద్ర మంత్రివర్గంలో నక్వీ, ఇప్పుడు సీఈసీలో షానవాజ్‌ల ఉద్వాసనతో ముస్లిమ్‌ల ప్రాతినిధ్యం లోపించింది. ఆ లోటు భర్తీకి కాషాయపార్టీ వ్యూహమేమిటో చూడాలి. మొత్తానికి గెలిచినా, ఓడినా ఒక ఎన్నిక తర్వాత మరో ఎన్నికకు అవిశ్రాంతంగా సిద్ధమవడమే మంత్రమైన మోదీ – షా మార్కు కొత్త 'బీజేపీ టీమ్ 2024' సిద్ధమైంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** బ.అష్టమి రా.1.07 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** కృత్తిక తె.4.56 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** సా.4.08 నుండి 5.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.27 నుండి 1.19 వరకు, **అమృతఘడియలు:** రా.2.19 నుండి 4.02 వరకు, **గోకులాష్టమి, శ్రీకృష్ణ జన్మాష్టమి.**

సూర్యోదయం: 5.46
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం: ఉ.10.30 నుంచి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుంచి 4.30 వరకు

నిత్య హరిత విప్లవం అభిలషణీయం

విశ్లేషణ



ఎం.ఎస్. స్వామినాథన్

మన జనాభాలో దాదాపుగా మూడింట రెండొంతుల మందికి వ్యవసాయమే జీవిత విధానంగా, ప్రధాన జీవనాధారంగా ఉంటోంది. వ్యవసాయంలో స్తబ్దత కొనసాగినట్లయితే మనం పురోగతి సాధించలేమన్నది స్పష్టమే. 1960ల మొదట్లో ప్రదర్శించిన చిత్తశుద్ధిని నేడు మళ్లీ చూపించాలి. తృణ ధాన్యాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. పోషకాహార విలువలు కలిగిన స్థానిక పంటలను ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగం చేయాలి. పర్యావరణ, ఆర్థిక ప్రాతిపదికన సేంద్రియ వ్యవసాయం, పంటలు, పశువుల సమీకృత విధానాన్ని ప్రోత్సహించాలి. కనీస మద్దతు ధరతో పాటు సమర్థమైన రైతు కేంద్రకమైన మార్కెటింగ్ వ్యవస్థను ఉనికిలోకి తేవాలి. సగటు ఆహార భద్రత నుంచి వ్యక్తుల్లో పోషకాల భద్రత వైపు మన ప్రాధాన్యతలు మారాల్సి ఉంది.

దేశమంతా అలుముకుంటున్న వ్యవసాయ రంగ సంక్షోభం వ్యవసాయదారుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరాన్ని ఎత్తి చూపింది. 1960ల మొదట్లో ప్రదర్శించిన అదే చిత్తశుద్ధిని వ్యవసాయం పట్ల నేడు మళ్లీ చూపించాల్సిన అవసరం ఉంది. అనేక అంచనాల ప్రకారం, వ్యవసాయం ఇప్పుడు ఫలదాయకం కాదు. ఏదైనా అవకాశం ఉంటే, 40 శాతం మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకోవాలని అనుకుంటున్నారు.

మన జనాభాలో దాదాపుగా మూడింట రెండొంతుల మందికి వ్యవసాయమే జీవిత విధానంగా, ప్రధాన జీవనాధారంగా ఉంటోంది. వ్యవసాయంలో స్తబ్దత కొనసాగినట్లయితే మనం పురోగతి సాధించలేమన్నది స్పష్టమే.

హరిత విప్లవం అనేది ఉత్పాదకత పెంపుదల ప్రక్రియ కోసం కనుగొన్న పదబంధం. 1960లు, 70లలో ఆవిర్భవించిన హరిత విప్లవం గోధుమ, వరి, జొన్న ఇతర పంటలకు సంబంధించిన కొత్త జన్యు వంగడాల అభివృద్ధి, విస్తరణలపై ఆధారపడింది. నీటిని, సూర్యకాంతిని, మొక్కల పోషకాలను సమర్థంగా వినియోగించుకుని వాటిని ధాన్యాలుగా మార్చడంలోని సామర్థ్యమే ఈ హరిత విప్లవం ప్రాతిపదిక. వాయవ్య భారత్‌లోని నీటి లభ్యత గల ప్రాంతాలకు మాత్రమే ఈ హరిత విప్లవం పరిమితమైంది. అయితే, ఇక్కడ కూడా, తీవ్రమైన పర్యావరణ, ఆర్థిక కారణాల వల్ల వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోతోంది. దీనికి తోడు రైతుల రుణభారం కూడా పెరిగిపోతోంది. ఇప్పుడు సవాలు ఏమిటంటే, హరిత విప్లవాన్ని దాని కేంద్రంలోనే విఫలం కానివ్వకుండా అధిగమించడానికి పోరాడటమే.

అటు రుతుపవనాలు, ఇటు మార్కెట్‌తో మన వ్యవసాయం రెండు రకాలుగా జూదంలా మారిపోయింది. నీటిపారుదలపై ప్రభుత్వ వ్యయం పడిపోతోంది కానీ, భారత్ నిర్మాణ్ ప్రోగ్రాం ద్వారా దీన్ని మార్చేయవచ్చని ఆశ కలుగుతోంది. నీటి అవసరం తక్కువగా ఉండే తృణధాన్యాలు, నూనె గింజలు, ఇతర అధిక విలువ కలిగిన పంటలు పండే మెట్టభూముల్లో ఉత్పాదకతను పెంచవలసిన అవసరం ఉంది. అయితే వీటిలో చాలా భాగం మనం దిగుమతి చేసుకుంటున్నాం. బీటీ కాటన్ వంటి వ్యయభరితమైన టెక్నాలజీలను ఈ ప్రాంతాలకు వర్తింపజేస్తే సన్నకారు రైతులకు నష్టదాయకం అవుతుంది. ఎందుకంటే వ్యవసాయ ఖర్చులకోసం భారీ రుణాలను వీరు తీసుకోవలసి ఉంటుంది. పైగా పంట విఫలమైతే తట్టుకునే సామర్థ్యం వీరికి ఉండదు.

రాగి, సజ్జ లాంటి తృణధాన్యాలు, పశుదాణా లాంటి సంప్రదాయ పంటలను విత్తనాల మార్పిడి కోసం ప్రధానమంత్రి ప్యాకేజీలో భాగంగా పునరుద్ధరించి, ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. పర్యావరణ, ఆర్థిక ప్రాతిపదికన సేంద్రియ వ్యవసాయం, పంటలు, పశువుల సమీకృత విధానాన్ని ప్రోత్సహించాల్సి ఉంది. అయితే ఇది



సరిపోదు. ఇలాంటి మెట్ట ప్రాంతాల్లోని రైతులకు అత్యవసరమైనది ఏమిటంటే, కనీస మద్దతు ధర. దాంతోపాటు సమర్థమైన రైతు కేంద్రకమైన మార్కెటింగ్ వ్యవస్థను ఉనికిలోకి తీసుకురావడం. ధాన్యాలు, తృణధాన్యాలు వంటి పోషకాహార విలువలు కలిగిన స్థానిక పంటలను ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగం చేయాలి. దిగుమతి చేసుకున్న పంటలపై కాకుండా, స్థానికంగా పెంచిన పంటలపై మన ఆహార భద్రతా వ్యవస్థ ఆధారపడి ఉండాలి.

పర్యావరణానికి హాని కలిగించకుండానే పంటల ఉత్పాదకతను మెరుగుపర్చడానికి ఉద్దేశించిన నిత్య హరిత విప్లవం కోసం టెక్నాలజీని, పబ్లిక్ పాలసీని వృద్ధి చేయవలసిన అవసరం గురించి నేను 15 సంవత్సరాల క్రితం నొక్కి చెప్పాను. సేంద్రియ వ్యవసాయం, హరిత వ్యవసాయం, పర్యావరణ హిత వ్యవసాయం, మైక్రో ఆర్గానిజంపై ఆధారపడిన వ్యవసాయం వంటి విభిన్న స్వావలంబనా వ్యవసాయ విధానాలను తగిన విధంగా అమలు పర్చడంపై ఆధారపడినదే నిత్య హరిత విప్లవం. సేంద్రియ వ్యవసాయం అనేది ఖనిజ ఎరువులు, రసాయనిక పురుగు మందుల ఉపయోగాన్ని మినహాయించాలి. జన్యుపరంగా మెరుగుపర్చిన పంటలు, సమీకృత చీడ, పోషకాల నిర్వహణ సూత్రంపై ఆధారపడి చైనాలో విస్తృతంగా చేస్తున్న హరిత వ్యవసాయాన్ని అమలు చేయాలి. దీంతోపాటు సహజ వనరుల వినియోగం, పెంపుదలను సమీకృతం చేయాలి. వర్షాధార, సాగునీటి ప్రాంతాలు రెండింటిలోనూ విభిన్న వ్యవసాయ-పర్యావరణ, సామాజిక వాతావరణాలకు అనువైన వైవిధ్యపూరితమైన స్వావలంబనా వ్యవసాయ పద్ధతులను మనం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పర్యావరణపరంగా స్వావలంబనతో కూడిన వ్యవసాయ సాంకేతికతలు అందుబాటులో ఉండే 'దూ-ఎకాలజీ' వైఖరిని మనం చేపట్టాల్సి ఉంది. ఉదాహరణకు, తప్పనిసరిగా వర్షపునీటిని నిల్వ చేయడం, మూడు సంవత్సరాల రొటేషన్ పద్ధతి ఈ 'దూ-ఎకాలజీ' పద్ధతిలో ఉంటుంది. ఈ మూడేళ్ల పద్ధతిలో ఖరీఫ్, రబీ సీజన్లు రెండింట్లోనూ చిక్కుళ్లను పండిస్తారు. దీనివల్ల రైతు కుటుంబాలకు, దేశానికి కూడా విజయం కలిగేలా ఇది తోడ్పడుతుంది.

ఆహార భద్రతలో మూడు ప్రధానమైన కోణాలు ఉంటున్నాయి. తగినంత కొనుగోలు శక్తి లేకపోవడంతో దీర్ఘకాలికంగా క్షుద్బాధ; ఆహారంలో విటమిన్ ఏ, ఐరన్, అయోడిన్, జింక్ వంటి సూక్ష్మ పోషకాల కొరత వల్ల శరీరంలో దాగి ఉండే ఆకలి; క్షామం, వరదలు, తుపానులు, ఇతర పర్యావరణమైన మార్పుల కారణంగా విచ్ఛిన్నత ద్వారా కలిగే నిరంతర క్షుద్బాధ. ఆకలిని తగ్గించే ఏ వ్యూహమైనా ఈ మూడు అంశాలనూ తప్పకుండా పరిష్కరించాల్సి ఉంది. సగటు ఆహార భద్రత నుంచి వ్యక్తుల్లో పోషకాల భద్రత వైపు మన ప్రాధాన్యతలు మారాల్సి ఉంది. సమతుల్య ఆహారాన్ని శారీరక పరంగా, ఆర్థికపరంగా, పర్యావరణపరంగా, సామాజికంగా అందుబాటులో ఉంచడమే పోషకాల భద్రతకు ఉత్తమ నిర్వచనంగా ఉంటుంది. రక్షిత మంచి నీరు, పర్యావరణ పరమైన పారిశుధ్యం, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య అనేవి కూడా దీంట్లో భాగమే. పోషకాల భద్రతలో ఆహారం, ఆహారేతర అంశాలకు కూడా సమ ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరాన్ని ఇది సూచిస్తుంది.

మన దేశంలోని ప్రతి పంచాయతీ కూడా తనదైన సామాజికార్థిక, సాంస్కృతిక, పర్యావరణ పరిస్థితులకు అనుగుణమైన లక్ష్యాలను సాధించడానికి సొంత ప్రణాళికను అభివృద్ధి చేసుకోవలసి ఉంది. పోషకాహార లేమిని అధిగమించాలంటే అత్యంత సమర్థవంతమైన పద్ధతి ఏదంటే, వ్యవసాయాన్ని పోషణ, ఆరోగ్యంతో మేళవించడమే. పోషణ కోణాన్ని జోడిస్తూ తమ సాంప్రదాయిక వ్యవసాయ వ్యవస్థలను పునర్నిర్మించుకోవడంలో రైతులు శిక్షణ పొందాలి. రెండు దశల్లో దీన్ని చేయవచ్చు. ఒకటి: అవసరమైన సూక్ష్మ పోషక విలువలు, మాంసకృత్తులను అందించే మొక్కలను రైతులకు అందించేలా, జీవరక్షణ మొక్కలతో కూడిన జెనెటిక్ గార్డెన్‌ని ఏర్పర్చాలి. విటమిన్ ఏ కొరతను పరిష్కరించే ఆరెంజ్ స్వీట్ పొటాటో (చిలగడదుంప లాంటిది) వంటివి వీటిలో కొన్ని. రెండు: స్థానిక సమాజాల సభ్యులకు సమాజ ఆకలి వ్యతిరేక యోధుల్లా శిక్షణ అందించాలి. వీరికి ఆ ప్రాంత పోషకాహార సమస్యలను అధిగమించే పద్ధతులను గురించి క్షుణ్ణంగా అవగాహన కలిగించాలి.

ఈరోజు మన రైతులు ప్రాణరక్షణ మద్దతు కోసం విలపిస్తున్నారు. కొద్ది సంవత్సరాల తర్వాత ఫలాలను అందించే పథకాలను మాత్రమే వారు కోరుకోవడం లేదు. బలమైన, ఉజ్వలమైన, సంపద్వంతమైన వ్యవసాయ దేశంగా మారడంలోనే భారత్ భవిష్యత్తు ఆధారపడి ఉంది.

వ్యాసకర్త వ్యవసాయ శాస్త్రవేత్త
('బిజినెస్ లైన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నామకరణం ఇలా...



1949లో ఈరోజు (ఆగస్ట్ 18): 'అడిడాస్' మా కంపెనీ ప్రారంభమైంది. ఈ పేరు దాని వ్యవస్థాపకుడు అడాల్ఫ్(అడీ) డాస్లర్ (డాస్) నుండి వచ్చింది.

– జాన్ ఎల్రిచ్‌మాన్, బిజినెస్ హిస్టారియన్

వ్యక్తిస్వామ్యం



జనతా పార్టీ, ఆ తర్వాత బీజేపీ తొలి రోజుల్లో ఆఫీస్ బేరర్ల పోస్టులను నింపడానికిగానూ పార్టీ, పార్లమెంటరీ పార్టీ ఎన్నికలు జరిగేవి. పార్టీ రాజ్యాంగానికి అది అవసరం. కానీ నేడు బీజేపీలో ఏ రకమైన ఎన్నికలూ జరగడం లేదు. ప్రతి పోస్టుకూ మోదీ ఆమోదించిన సభ్యుడిని నామినేట్ చేస్తున్నారు.

– సుబ్రమణియన్ స్వామి, కేంద్ర మాజీ మంత్రి

బాలీవుడ్ మారాలి



అంటే ఇప్పుడు నటుడు అర్జున్ కపూర్ ఏం సూచిస్తున్నట్టు? మనల్ని బలవంతంగా ట్రక్కుల్లో, బస్సుల్లో ఎక్కించుకుని సినిమా హాళ్లకు లాక్కెళ్లాలనా? ఆయనకు మెమో అంది నట్టు లేదు. పార్టీ ముగిసింది. కథాకథనాలను మెరుగుపరుచుకోనంతవరకూ; ప్రేక్షకుల ప్రజ్ఞ, విశ్వాసాలను అవమానించడం ఆపేంతవరకూ ప్రేక్షకులు బాలీవుడ్ వైపు కన్నెత్తిచూడరు.

– నందినీ బాహ్రీ, ట్రావెలర్

వీళ్లకేం కావాలి?



పార్టీల్లో మద్యం తాగుతూ, పాకిస్తాన్‌లో గానీ విదేశాల్లో గానీ తమకు నచ్చిన దుస్తులు ధరించే ఈ ధనిక ఉదార వాదుల సంగతేమిటో అర్థం కావడం లేదు. వీరు 'పీటీఐ' పార్టీకి మద్దతిస్తారు. మరి సామాన్య జనం కోసం ఇస్లాంకు సంప్రదాయ బ్రాండును జోడించాలన్న ఇమ్రాన్ ఖాన్ వినతి అవసరమైనదే అని వీరు భావిస్తున్నట్టా? లేక, దానికి పూర్తిగా కళ్లు మూసుకున్నారా?

– నిదా కిర్మాణీ, పాకిస్తాన్ ఫెమినిస్ట్

అదీ విషయం



సరైన పదజాలం ఎలా వాడాలో తెలుసుకోండి: ధనికులకు ఇచ్చేటప్పుడు వాటిని 'ప్రోత్సాహకాలు' అందురు; వాటినే పేదలకు ఇచ్చేటప్పుడు అవి 'ఉచితాలు' అవుతాయి.

– ప్రసేన్‌జిత్ దత్తా, వ్యాపారాంశాల కాలమిస్ట్

చైనా మార్కెట్



చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలడానికి దగ్గర్లో ఉంది. సుమారు యాభై లక్షల మంది వినియోగదారులు తమ డిపాజిట్లు నష్టపోయారు. బ్యాంకులు విచక్షణారహితంగా రుణాలిచ్చిన గృహ నిర్మాణ సంస్థలు చెల్లింపులు రాక సతమతమవుతున్నాయి.

– గ్రాహమ్ స్టీఫెన్, రియల్ ఎస్టేట్ ఇన్వెస్టర్

తిప్పడు పరీక్ష



ఢిల్లీలో ఇప్పుడు ఎలా ఉందంటే: నీకు జ్వరం వచ్చిందా కోవిడ్ 19 పరీక్షకు వెళ్లు. అక్కడ నెగెటివ్ వస్తే గనక స్వైన్ ఫ్లూ పరీక్ష చేయించుకో. అప్పుడూ నెగెటివే అయితే డెంగూ, మలేరియా పరీక్షలు చేయించుకో. అయినా నెగెటివ్ అయితే అది సీజనల్ ఇన్‌ఫ్లుయెంజా అన్నమాట!

– సోమృతా ఘోష్, జర్నలిస్ట్

ఇన్‌బాక్స్

ధార్మిక సేవా అక్షౌహిణి!

విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) .... ఈ పేరు ఇటీవల కాలంలో ప్రపంచ దేశాల ప్రజల నోళ్లలో నానుతున్న ధార్మిక పదం! అయోధ్య రామ జన్మభూమి కేసు సుప్రీం కోర్టులో విజయం సాధించిన 2019 నవంబర్ 9 నుంచి మొన్నటి రామమందిర నిర్మాణ భూమిపూజ (ఆగస్టు 5, 2020) నాటికి అన్ని వర్గాల్లో చర్చకు మూలమైంది విశ్వహిందూ పరిషత్. 1964లో శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభ పర్వదినాన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) రెండవ చీఫ్ మాధవ సదాశివ గోల్వాల్కర్ (గురూజీ) నేతృత్వంలో విశ్వహిందూ పరిషత్ పురుడు పోసుకుంది. ముంబై మహానగరంలోని సాందీపని ఆశ్రమం వేదికగా సంస్థకు అంకురార్పణ జరిగింది. మొట్టమొదట స్వామి చిన్మయానంద సరస్వతి అధ్యక్షులుగా వీహెచ్‌పీ కార్యక్షేత్రం లోకి అడుగుపెట్టింది.

అనేక మైన సంఘర్షణలు, ఆందోళనలు, నిర్మాణాత్మక కార్యక్రమాలతో వీహెచ్‌పీ దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. ఆర్ఎస్ఎస్‌కు అనుబంధంగా ఉంటూ ధార్మిక, సామాజిక, సేవా రంగాల్లో కార్యకలాపాలు విస్తరించింది. దాదాపు 17 ప్రధాన విభాగాల్లో హిందూ జీవన విధానంపై ప్రపంచానికి అవగాహన కల్పిస్తూ నిస్వార్థ కృషి సల్పుతున్నది. 1983లో వీహెచ్‌పీ ప్రతిష్ఠాత్మకంగా 'ఏకాత్మకం యజ్ఞం' నిర్వహించింది. 1983 నవంబర్ 16 నుంచి డిసెంబర్ 16 వరకూ సామాజిక సమరసతా భావం నింపేందుకు... అంటరానివారు, దళితులు అనే భావన విడనాడి 'సకల హైందవ జాతి ఒక్కటే' అని చాటి చెప్పింది. సామాజిక దురాచారాలను రూపుమాపేందుకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో నిర్వహిస్తోంది. ఏకాత్మక యజ్ఞం, అయోధ్య రామమందిర ఉద్యమ నిర్వహణలో విజయం సాధించి హిందువులకు ఆత్మవిశ్వాసం భరోసాను కల్పించింది. మతం మార్చుకున్న హిందువులను తిరిగి హిందూ మతంలోకి రప్పించే 'ఘర్ వాపసీ' ఉద్యమాన్నీ నిర్వహిస్తోంది.

– పగుడాకుల బాలస్వామి, వీహెచ్‌పీ తెలంగాణ ప్రచార సహ ప్రముఖ్
(వీహెచ్‌పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ప్రణాళికాబద్ధంగా దూరం చేస్తున్నారు!

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

డెబ్బై ఐదేళ్ల స్వాతంత్ర్య భారతంలో సామాజిక ఆర్థిక వ్యవస్థ మరింత కూలిపోవడానికి కారణం దళిత, బహుజన ఉత్పత్తి వర్గాలను ప్రధాన స్రవంతి లోని ఉత్పాదక శక్తులుగా మార్చకపోవడమే. అంటే ఒక 500 ఏళ్ల నుంచి నాటు వేసే కుటుంబాలు భూమి కలిగి లేకపోవడం; ఏ రంగంలో అయితే వారు తమ శ్రమను ధారబోస్తున్నారో ఆ రంగం భూస్వామ్య పెట్టుబడిదారుల చేతుల్లో ఉండడం ప్రధాన కారణం. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో శిశు ఆరోగ్య సంరక్షణ మరింతగా క్షీణించడం వలన పుట్టే పిల్లలు శక్తిమంతంగా పుట్టడం లేదు. మాతా శిశు పోషక ఆరోగ్య బాధ్యతలు మరింతగా క్షీణిస్తున్నాయి. అవినీతి అన్ని వైపులా అల్లుకుంటూ ఇచ్చే చేతికీ, తీసుకునే చేతికీ మధ్య వంద చేతులు ఏర్పడుతున్నాయి. భరత భూమిలో ప్రధాన వనరు భూమి. భూమి అందరి సొత్తు. కానీ ప్రతి రాష్ట్రంలోనూ ఇప్పుడు అది ఐదు కులాల చేతుల్లోనే ఉంది. మొత్తం భారత దేశంలో సుమారు 6,000 కులాలున్నాయి. అయితే దాదాపు భూమి అంతా 100 కులాల చేతుల్లోనే ఉంది. ఇంతకంటే పెద్ద అసమానత మనకి ఏ దేశంలోనూ కనిపించదు. మన జాతీయాదాయం మొత్తంలో 22 శాతం... ఒక్క శాతం మంది దగ్గరే ఉంది.

భారతదేశ సంపదాభివృద్ధి ప్రక్రియలోకి దళితులను ఎందుకు రానివ్వడం లేదు అనేది మన ముందున్న ప్రశ్న. ఇదంతా ఒక ప్రణాళికాబద్ధంగా జరుగుతోంది. సంపదను సృష్టిస్తున్న ఐటీ పరిశ్రమ భారతదేశంలో 1990 నుండి ప్రారంభమైంది. అతికొద్ది కాలంలోనే 16 లక్షల కోట్ల వ్యాపారం చేసింది. ఈ రంగంలో దేశంలోని పది, పదిహేను కులాలే జొరబడ్డాయి. ఈ రంగంలోకి దళితులు ప్రవేశించకుండా పెద్ద ప్రయత్నం జరుగుతోంది. ఇది పెద్ద సామాజిక ద్రోహం. ఇక జీడీపీ సంగతికొస్తే... ప్రపంచంలో రెండు దేశాలు ముందున్నాయి. ఒకటి చైనా.



రెండోది దక్షిణ కొరియా. దీనికి కారణం అక్కడ కుల, మత భేదాలు లేకుండా అందరినీ, అన్ని రంగాలలో ప్రోత్సహించడమే. భారతదేశంలో అటువంటి ప్రోత్సాహమే లేదు. దానికి కారణం కులవ్యవస్థ, అస్పృశ్యతా భావన. చైనా ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. చైనాతో మనం పోటీపడలేక పోవ దానికి కారణం మనదేశం లోని 60 కోట్ల మందినీ మనం ఉత్పత్తి రంగంలోకి తీసుకురాకపోవడం.

సామాజిక న్యాయానికి విఘాతం

ముఖ్యంగా 1970 తర్వాత ఏ కులం వారు ఆ కుల వ్యవస్థను పటిష్టం చేసుకుంటున్నారు. పారిశ్రామిక వ్యవస్థలు, విద్యా సంస్థలు అన్నింటిలోనూ స్వకులం వారినే రిక్రూట్ చేసుకుంటున్నారు. ఇది సామాజిక న్యాయ దూరం. మరో పక్క దేశంలో అవినీతి పెరిగిపోతోంది. అవినీతి మీద మాట్లాడే గళాలను అణచి వేయాలని చూస్తున్నారు. కనీసం స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా, హీరేన్ ముఖర్జీ, డాంగే, పుచ్చలపల్లి సుందరయ్య, కృష్ణ మీనన్, మాలవ్యా, లాల్ బహదూర్ శాస్త్రి, గుల్జారీలాల్ నందా, సుశీలా నాయర్, మొరార్జీ దేశాయ్, నంబూద్రి పాద్ వంటి వారు ప్రజాస్వామ్యంలోని లొసుగులను గురించి తమ గళాలు వినిపించగలిగే వారు. ఇప్పుడా పరిస్థితి భారత దేశంలో లేదు. స్వాతంత్ర్య భారతంలో ప్రజల వాక్కుకు స్వాతంత్ర్యం లేదు. ఈ దశాబ్దంలో ఎంతో మంది తమ వాక్కు వినిపించి హతులయ్యారు.

సంపన్న వర్గాలు, అగ్రకులాలు ఎన్నికలను పెట్టుబడి, రాబడిగా చూస్తున్నాయి. రాజకీయ రంగంలో ఓటు కొనడం ఎప్పుడు ప్రారంభించారో అప్పుడే ప్రజాస్వామ్య విలువలు కుప్పకూలడం ప్రారంభమయ్యింది. ధనికుల రక్షణ, పేదల భక్షణ కొనసాగుతోంది. పోలీసు వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, పాలక వ్యవస్థ ధనవంతులకు ఊడిగం చేస్తున్నాయి. ధనవంతులు మరింత ధనవంతులు కావడానికి కారణం రాజ్యాంగ ఉల్లంఘనే.

ఈ 75 ఏళ్లలో శాస్త్రీయ, వైజ్ఞానిక, సాంకేతిక జ్ఞానం అంతరిస్తూ వస్తోంది. భారతదేశంలో ప్రధాన మతమైన బౌద్ధం పునరుజ్జీవం మీద దెబ్బ కొట్టారు. హిందూ మతోద్ధరణకు పూనుకుని బడులు తగ్గించి గుడులు పెంచారు. హిందూ మతేతరమైన జైన, సిక్కు, బౌద్ధ, క్రైస్తవ, జొరాస్ట్రియన్ వంటి మత ధర్మాలను ఎదగకుండా చేశారు. మానవ, సామాజిక, వ్యక్తి ధర్మాలను ధ్వంసం చేసి అరాచకత్వాన్ని పెంచారు. భారతీయ తాత్వికులైన చార్వాకులు, సాంఖ్యాయనులు వంటి భౌతిక తాత్వికుల ధర్మాలను కాలరాశారు. వీటన్నిటి ఫలితంగా భారతదేశం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక దోపిడీలో మగ్గుతోంది. స్వాతంత్ర్యం అగ్రకులాల, అగ్ర వర్గాల అనుభవైకవేద్యమయ్యింది. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్క దళితుడూ, బహుజనుడూ, మైనారిటీలు చేతబూనాల్సిన చారిత్రక సందర్భం ఇది. రాజ్యాంగం ఇచ్చిన ఉద్యమ హక్కుని, పోరాట హక్కుని పునరుజ్జీవింపజేసి మనుషులు చైతన్యవంతులై, నీతిమంతులై, వ్యక్తిత్వ నిర్మాణ దక్షులై తమను తాము అమ్ముకోకుండా; తమను తాము రక్షించు కుని, జీవింపజేసుకుని, నూతన భావాలను పునరుజ్జీవింపజేసుకుని రాజ్యాధికార దిశగా కొనసాగ వలసిన రోజులివి. పోరాటం మానవుని హక్కు. జీవించడం మానవుని హక్కు. సంపద అందరికీ సమానంగా పంపిణీ అయ్యే వరకూ పిడికిళ్లు బిగుసుకునే ఉంటాయి. ఐక్యతా పోరాటమే స్వాతంత్ర్యానికి పునాది.

వ్యాసకర్త సామాజిక ఉద్యమకారుడు
మొబైల్ : 98497 41695

సాక్షి
విజయనగరం
శుక్రవారం । 19 । ఆగస్టు । 2022



ప్రతి చిత్రం ఓ తీపిగుర్తు

ఒక్క క్లిక్ జ్ఞాపకాల సమాహారం. వందమాటల వినే కన్నా ఒక్క చిత్రం చెప్పే సమాధానం ఎంతో విలువైన ది. ఎన్నో అనుమానాలు..అపోహలను నివృత్తి చేసే సాక్ష్యం చిత్రం.

- 8లో



ప్రగతి మార్గంలో ఆర్టీసీ

మీ ప్రయాణం సురక్షితం.. సుఖవంతం అన్నది ఆర్టీసీ నినాదం.. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొత్తగా వెయ్యి బస్సులు నడుపుతామని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు తెలిపారు.

- 8లో

కుండపోత



పాలకొండ: పాలకొండ మండలంలో గురువారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్ర నాలుగు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ఏకధాటిగా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. రోడ్లు జలమయమయ్యాయి. వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

న్యూస్‌రీల్

ప్రత్యేక పరిశీలకుల నియామకం

విజయనగరం: జిల్లాలో వైఎస్సార్‌సీపీని మరింత పటిష్టం చేసేందుకు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా సాగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ప్రాంతీయ సమన్వయకర్త, మంత్రి బొత్స సత్యనారాయణ సూచనల మేరకు విజయనగరం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు ప్రత్యేక పరిశీలకులను నియమించింది. వారి జాబితాను పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు.ఎస్‌కోట నియోజకవర్గానికి కేవీ సూర్యనారాయణరాజు, నెల్లిమర్లకు మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, రాజాంకు కొండపల్లి కొండలరావు, బొబ్బిలికి మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతిలను నియమించారు. అలాగే, గజపతినగరం నియోజకవర్గానికి ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు, విజయనగరానికి రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, చీపురుపల్లికి డీసీసీబీ చైర్మన్ వేచలపు చిన రాము నాయుడును ప్రత్యేక పరిశీలకులుగా నియమించినట్లు జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు. పరిశీలకులంతా శుక్రవారం నుంచి బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ పార్టీకి అనుబంధంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు.

ప్రయోజనకరంగా ఫీల్డ్ స్టడీ



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు

విజయనగరంఅర్బన్: సాంకేతిక విద్యా బోధనలో ఫీల్డ్ స్టడీకి ఎంపిక చేసుకున్న అంశం గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రయోజనకరమైనదిగా ఉండాలని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీ రిజిస్ట్రార్, నోడల్ అధికారి ప్రొఫెసర్ జి.స్వామినాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యాబోధనలో చేపట్టిన నూతన సంస్కరణల అమలుపై యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్ ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాళ్లకు వర్సిటీ సమావేశమందిరంలో గురువారం అవగాహన కల్పించారు. నూతన విద్యాబోధన విధానం ప్రకారం కోర్సు రెండో సంవత్సర వార్షిక ఉత్తీర్ణత మార్కుల కోసం రెండు నెలలపాటు కమ్యూనిటీ సర్వీసెస్ ఇంటెర్న్‌షిప్‌ను విద్యార్థులతో గ్రామీణ ప్రాంతాల్లో చేయించాలన్నారు. కమ్యూనిటీ సర్వీసెస్‌కు తీసుకున్న అంశం సందేశాత్మకంగా ఉంటే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రతీ పది నుంచి 20 మంది విద్యార్థులకు ఒక మోనిటర్‌ను ఏర్పాటు చేసుకొని ఏరోజుకారోజు అప్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వి.ఎస్.వకుల, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్స్ ప్రొఫసర్ కె.బాబులు, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అడల్ట్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

తోడు కోసం..!



- జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి
- పాదముద్రలను బట్టి ఆడపులిగా భావిస్తున్న అటవీ అధికారులు
- నాలుగు నెలలుగా ఒకటే అలజడి
- ఏడు ఫారెస్టు బీట్ ఏరియాల్లోనే వెనుకకూ ముందుకు!
- ప్రస్తుతం రాబా అటవీ ప్రాంతంలో తిష్ట
- చిత్రీకరించేందుకు కెమెరాలను అమర్చిన అటవీ సిబ్బంది
- ఇప్పటివరకూ నాలుగు పశువులను హతమార్చిన పులి
- గొర్రెల మందపై దాడి చేసి ఒక గొర్రెను నోట కరుచుకుపోయిన వైనం
- నష్టపోయిన రైతులకు వెనువెంటనే పరిహారం




గజపతినగరం మర్రివలస ప్రాంతంలో దూడ కళేబరం చుట్టూ కెమెరాలను అమర్చుతున్న అటవీ అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం ఉమ్మడి జిల్లాల్లో మూడు దశాబ్దాల్లో పెద్దపులి సంచరించిన దాఖలాలు లేవు. నాలుగు నెలల కిందట ఒడిశా సరిహద్దుకు సమీపంలో కనిపించిన ఓ నాలుగేళ్ల వయసున్న రాయల్ బెంగాల్ టైగర్ జిల్లా ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. మనుషులకు ఏమాత్రం హాని చేయకపోయినా ఆహారం కోసం నాలుగు పశువులను హతమార్చింది. ఒకసారి గొర్రెల మందపై దాడి చేసి వాటిలో ఓ గొర్రెను నోటకరుచుకుపోయింది. దాని పాదముద్రలను బట్టి వయసును అటవీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పులికి ఇటీవల కాలంలోనే విజయనగరం జిల్లాకు ఆనుకొని ఉన్న అనకాపల్లి జిల్లా, ఆ పక్కనే ఉన్న కాకినాడ జిల్లాలో కనిపించిన పులికి ఏమైనా సంబంధం ఉందా? అదీ ఇదీ ఒకటేనా? లేదా వేర్వేరా? అనే విషయమై అటవీ శాఖ అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే కాకినాడ జిల్లాలో ఉండగా పెద్దపులి కెమెరాకు చిక్కింది. ప్రస్తుతం మన జిల్లాలో సంచరిస్తున్న పులిని చిత్రీకరించేందుకు కెమెరాలను అమర్చారు. ఈ ఫొటో కూడా వస్తే అసలు విషయం తెలుస్తుంది. మన రాష్ట్రంలో నలమల అడవుల్లోనే పెద్దపులులు ఉన్నాయి. శ్రీశైలం అభయారణ్యంలో ఒక్కో పులి 30 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో సంచరిస్తుంటాయి. అది తన రాజ్యంగా భావిస్తుంటాయి. ఆ సరిహద్దు చుట్టూ మలం, మూత్రం విసర్జిస్తుంటాయి. చెట్లకు గోళ్లతో రక్కి గుర్తులు ఏర్పాటు చేస్తుంటాయి. మూత్రం కూడా ఎక్కువ రోజుల పాటు ఘాటు వాసన వస్తుంది. దాన్ని బట్టి మరో పులి ఆ పరిధిలోకి పోదు. ప్రకృతి ధర్మం ప్రకారం పునరుత్పత్తి కోసం మాత్రమే ఆడపులితో జతకడతాయి. సాధారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ వాటి సంభోగ సమయం (మేటింగ్ సీజను) ఉంటుంది. నాలుగేళ్ల వయసు వచ్చేసరికి తోడు కోసం వెతుకుతూ వెళ్తుంటాయి. ప్రస్తుతం జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి పాదముద్రల పరిమాణాన్ని బట్టి నాలుగేళ్ల వయసు ఉంటుందని అటవీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఫొటో దొరికితే అది ఆడదా లేదా మగదా అని తెలుస్తుంది. అంతేకాదు మన వేలిముద్రల మాదిరిగానే పులి చారలు కూడా ఏ రెండింటికీ ఒకే మాదిరిగా ఉండవు. ఇప్పటికే కాకినాడ జిల్లాలో సంచరిస్తున్న పులి ఫొటో అటవీ అధికారుల వద్ద ఉంది. ప్రస్తుతం మన జిల్లాలో ఉన్న పులి ఫొటో కూడా తీయగలిగితే... అదీ ఇదీ ఒకటేనా లేదా వేర్వేరా అనేది తెలుస్తుంది.

ఒడిశా నుంచి వచ్చిందా?


పెద్దపులి మన జిల్లాలో తొలుత కనిపించిన ఆంధ్ర ఫారెస్టు ఏరియా ఒడిశా సరిహద్దుకు సమీపంలోనే ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలానికి సరిహద్దు ప్రాంతమే అదంతా. తర్వాత అరకు అటవీ ప్రాంతం దాటితే ఒడిశా సరిహద్దు ఉంది. అక్కడున్న దట్టమైన అటవీ ప్రాంతం నుంచే పెద్దపులి వచ్చి ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో తాటిపూడి, ఆంధ్ర జలాశయాల చుట్టూ విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలోనే ఎక్కువగా సంచరిస్తోంది.



ఆంధ్ర ఫారెస్టు ఏరియాలో...

12.4.2022: ఆంధ్ర అటవీ ప్రాంతమైన మెంటాడ మండలం బిరసాడవలసలో తొలిసారిగా పెద్దపులి కనిపించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండల సరిహద్దులోనున్న బిరసాడవలస కొండ దగ్గర గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. అక్కడ కందకంలోనున్న పులిని సమీపంలో కోళ్లఫారం దగ్గర పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్న స్థానికుడు ఒకరు గమనించారు. అది గాండ్రించి మీదకు ఉరకడంతో అతను బైక్‌ను వేగంగా పోనిచ్చి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

28.7.2022: గజపతినగరం మండలం బంగారమ్మపేట గ్రామ శివారులోని కందిమడి పొలంలో పెద్దపులి ఉండటాన్ని స్థానికులు ఇద్దరు గమనించారు. అక్కడ పాదముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు.



9.8.2022: మళ్లీ బిరసాడవలస ప్రాంతంలో ఆగస్టు 9వ తేదీన గొర్రెల మందపై పెద్దపులి దాడి చేసింది. నాలుగు గొర్రెలను గాయపరిచింది. ఒకదాన్ని నోట కరిచి కొండపైకి తీసుకెళ్లిపోయింది.

వెంకయ్యపాలెం అటవీ ప్రాంతంలో...

17.4.2022: వెంకయ్యపాలెం బీట్ పరిధిలోని వేపాడ మండలం మారిక పంచాయతీ పరిధి వెంకయ్యపాలెం పరిసరాల్లో పెద్దపులి పాదముద్రలు కనిపించాయి.

12.6.2022: వేపాడ మండలంలోనే పోతిబండిపాలెం గ్రామ పరిసరాల్లో పెద్దపులిని కొద్దిదూరం నుంచి స్థానిక గిరిజనుడు చూశాడు.

గంటికొండ అటవీ ప్రాంతంలో...

26.4.2022: ఎస్.కోట, గంట్యాడ మండలాల సరిహద్దులోనున్న గంటికొండ అటవీ ప్రాంతం ఉంది. ఎస్.కోట మండలంలోని భీమవరం, కృష్ణాపురం గ్రామాల సమీపంలో రెండు ఆవులపై పెద్దపులి దాడి చేసింది. వాటిలో ఒకటి చనిపోయింది.

26.4.2022: అదే రోజు ఎస్.కోట మండలం బొడ్డవర, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం చిలకలగెడ్డ సరిహద్దు ప్రాంతంలో పెద్దపులి పాదముద్రలు కనిపించాయి.

14.8.2022: ఎస్.కోట మండలం కాపుసోంపురం, దొర్లపాలెం రైల్వే ట్రాక్ సమీపంలో పులిని ఓ గ్రామస్తుడు గమనించి స్థానికులను తీసుకెళ్లేసరికి అక్కడి నుంచి వెళ్లిపోయింది.

దమరసింగి బీట్ ఏరియాలో...

5.8.2022: దమరసింగి ఫారెస్టు బీట్ ఏరియా పరిధిలోని దత్తిరాజేరు మండలం కన్నాం గ్రామ శివారులో ఒక ఆవుపై పెద్దపులి దాడి చేసింది. ఆవు గొంతు, కాలు వెనుక భాగంలో గాయాలయ్యాయి. దీనికి గ్రామ సచివాలయంలోని పశువైద్య సహాయకులు సకాలంలో వైద్యం అందించారు.

కొత్తపాలెం బీట్ ఏరియాలో...



16.8.2022: కొత్తపాలెం ఫారెస్టు బీట్ పరిధిలోని బొండపల్లి మండలం వెదురువాడ గ్రామ పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన కొత్తపనసలపాడు వద్ద ఒక ఆవు, ఒక కోడెదూడపై పెద్దపులి దాడి చేసింది. ఆ రెండూ చనిపోయాయి. కోడెదూడ కళేబరాన్ని సమీపంలోని కొండపైకి పులి లాక్కెళ్లింది. ఆ కళేబరాన్ని తినడానికి మళ్లీ వస్తే గుర్తించేందుకు అక్కడ నాలుగు కెమెరాలను అటవీ శాఖ అధికారులు అమర్చారు.

17.8.2022: వెదురువాడ గ్రామ పంచాయతీ పరిధిలోని మరో శివారు గ్రామమైన కొత్తమూలపాడు వద్ద పెద్దపుల్లి పాదముద్రలు కనిపించాయి.

రాబా అటవీ ప్రాంతంలో...

27.7.2022: మెంటాడ, గజపతినగరం మండలాల పరిధిలోనున్న రాబా అటవీ ప్రాంతంలో ప్రస్తుతం పెద్దపులి ఉంది. తొలుత జూలై 27వ తేదీన మెంటాడ మండలం పనుకువానివలస శివారులో రెండు రోజులు (12) సంచరించింది.

తాజాగా: గజపతినగరం మండలం మర్రివలస పంచాయతీ పరిధిలోని సిడగంవలస వద్ద ఆవుదూడను గురువారం వేకువజామున పెద్దపులి చంపేసింది. దూడ కళేబరాన్ని తినేందుకు మళ్లీ పెద్దపులి వచ్చే అవకాశం ఉన్నందున ఆ పరిసరాల్లో నాలుగు కెమెరాలను అటవీ శాఖ అధికారులు అమర్చారు.

పల్లపుగుడాబు అటవీ ప్రాంతంలో...

26.7.2022: వేపాడ, కొత్తవలస మండలాలకు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి, కె.కోటపాడు, సబ్బవరం మండలాల సరిహద్దులో విస్తరించి ఉన్న పల్లపుగుడాబు అటవీ ప్రాంతంలోనే పెద్దపులి ఎక్కువ రోజులు గడిపింది. జూలై 26న కొత్తవలస మండలం దిగువ ఎర్రవానిపాలెంలో పులి పాదముద్రలు కనిపించాయి. ఆ మర్నాడే కొత్తవలస మండలం చీడివలస, సుందరయ్యపేటలో కూడా పాదముద్రలను అటవీశాఖ అధికారులు కనుగొన్నారు. వీఎంపేటలోనూ పులి కనిపించిందని తెలిసింది.

30.7.2022: కొత్తవలస మండలం వీరభద్రపురం పంచాయతీ పరిధిలోని మునగపాకవానిపాలెం వైపు పులి వచ్చే అవకాశం ఉందని గ్రామస్థులను అటవీ శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. ఆ మర్నాడే చీపురువలస (15), గులివిందాడ (16) గ్రామాల పరిసరాల్లో పులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించాయి.

8.8.2022: కొత్తవలస మండలంలోని చీడివలస గ్రామ పరిసరాల్లో పులి పాదముద్రలు కనిపించాయి.



పులిజాడపై ఆరా తీస్తున్న అధికారులు

ట్రాప్ పెట్టినా చిక్కట్లేదు...



జిల్లా అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్దపులిని పట్టేందుకు తొలుత ట్రాప్ పెట్టాం. కానీ అది ఒకేచోట ఉండట్లేదు. పాదముద్రలు ఉన్నచోట కెమెరాలు పెడుతున్నాం. ఫొటోలు వస్తే కానీ దాని వివరాలు పూర్తిగా చెప్పలేం. పాదముద్రలు 14 నుంచి 15 సెంటీమీటర్ల పొడవు ఉంటున్నాయి. చిరుతపులి అయితే 12 సెంమీ మించవు. అటు అనకాపల్లి, విశాఖ, కాకినాడ జిల్లాల్లో, ఇటు విజయనగరం జిల్లాల్లో పెద్దపులి ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. కానీ ఒకే సమయంలో వాటి దాడులు జరగట్లేదు. దీన్ని బట్టి వేర్వేరా లేదా రెండూ ఒకటేనా అనేదీ స్పష్టంగా చెప్పలేకపోతున్నాం. **- శంబంగి వెంకటేష్, జిల్లా అటవీ అధికారి, విజయనగరం**

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం...



పెద్దపులి జిల్లాలో ఏడు ఫారెస్టు ఏరియాల్లోనే అటూ ఇటూ సంచరిస్తోంది. జనావాసాలకు దూరంగా పాకల్లో కట్టేసిన పశువులపైనే దాడి చేస్తోంది. ఇప్పటివరకూ రెండు ఆవులు, రెండు దూడలను చంపేసింది. నష్టపోయిన రైతులకు పరిహారం ఆవుకు రూ.25 వేలు, దూడకు రూ.10 వేల చొప్పున వెంటనే ప్రభుత్వం చెల్లిస్తోంది.
- అప్పలరాజు, ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, విజయనగరం

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఈఓ కె.వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అవార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు కనీసం 15 ఏళ్ల సర్వీసు కలిగి ఉండాలని సూచించారు. ఎంఈఓ, డిప్యూటీ డీఈఓ కౌంటర్ సంతకం చేయించిన దరఖాస్తులను ఈనెల 25వ తేదీలోపు డీఈఓ కార్యాలయానికి అందజేయాలని పేర్కొన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుల్లో ఒకరిని రాష్ట్రస్థాయి అవార్డుకు సిఫార్సు చేయడానికి అవకాశం ఉన్నందున వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

ఆర్‌ఓబీ పనులకు సన్నాహాలు




పీఎం గతిశక్తి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

- ఆర్‌ఓబీని పరిశీలించిన పీఎం గతిశక్తి ఇంజినీరింగ్ బృందం
- త్వరితగతిన ప్రారంభించాలని కోరిన ఎంపీ 'బెల్లాన'

చీపురుపల్లి: విజయనగరం–పాలకొండ రోడ్డులో కొత్తగా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. ఆర్‌ఓబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12.97 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు పీఎం గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజర్, డిప్యూటీ చీఫ్ ఇంజినీరుల బృందం మరమ్మతులకు గురైన ఆర్‌ఓబీను గురువారం పరిశీలించింది. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆర్‌ఓబీ వద్దకు చేరుకుని ఇంజినీరింగ్ బృందంతో చర్చించారు. ప్రయాణాలు సజావుగా సాగేలా త్వరితగతిన నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. ఆర్‌ఓబీ మరమ్మతులకు గురికావడం, భారీ వాహన రాకపోకలు నిషేధించడం వల్ల విజయనగరం– పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. ఇదే విషయాన్ని పార్లమెంట్ సమావేశాల్లో చర్చించామని, రైల్వే బోర్డు చైర్మన్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. తక్షణమే డీపీఆర్‌లు సిద్ధంచేసి, టెండర్లకు ఆహ్వానించి పనులు ప్రారంభించాలని కోరారు. దీనికి స్పందించిన ఇంజినీరింగ్ అధికారులు ఒక్కరోజు కూడా వృథా చేయకుండా పనులు జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ వెంట కొసిరెడ్డి రమణ, పీతల మురళి, రెడ్డి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ మిస్సయ్యిందా..?





స్వాధీనం చేసుకున్న మొబైల్స్‌తో ఎస్పీ, ఇతర అధికారులు

విజయనగరం క్రైమ్:

మొబైల్ మిస్సయిందా..? ఎక్కడ, ఎప్పుడు, ఎలా అనే విషయాలను వివరిస్తూ, వాటి ఐఎంఈఐ నంబర్లు, అడ్రస్, కాంటాక్టు నంబర్‌తో వెబ్‌పోర్టల్‌లో ఫిర్యాదుచేస్తే చాలు.. విజయనగరం జిల్లా సైబర్ పోలీసులు ట్రాక్‌చేస్తారు. ఆ మొబైల్స్‌ను ఎవరు వినియోగిస్తున్నారో తెలుసుకుని స్వాధీనం చేసుకుంటారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఈ సదుపాయం విజయనగరం జిల్లా ప్రజలకు మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ఎస్పీ దీపికాఎం.పాటిల్ సూచనల మేరకు ఫిర్యాదుదారులు సులభంగా ఫిర్యాదు చేసుకునేలా విశాఖపట్నం దువ్వాడ విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగానికి చెందిన విద్యార్థినులు రూపొందించిన 'వీజెడ్ ఎమ్‌మొబైల్‌ట్రాకర్ డాట్ ఇన్'ను ఎస్పీ గురువారం ఆవిష్కరించారు.

రూ.16.54లక్షల విలువైన మొబైల్స్ స్వాధీనం..

జిల్లాలో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు గత నెలలో ఎస్పీ దీపిక వాట్సాప్ నంబర్ 89779 45606ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. దీనికి చాలామంది బాధితులు ఫిర్యాదు చేశారు. నెలల వ్యవధిలోనే రూ.16.54లక్షల విలువైన 103 ఫోన్‌లను సైబర్ పోలీసులు ట్రేస్ చేశారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బీహార్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలలో వినియోగిస్తున్న మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎస్పీ కార్యాలయంలో బాధితులకు గురువారం అందజేశారు. మొబైల్స్ రికవరీ చేయడంలో శ్రమించిన సైబర్‌సెల్ ఎస్‌ఐలు ఎం.ప్రశాంత్‌కుమార్, నీలావతి, బి.వాసుదేవరావు, ఎం.శ్రీనివాసరావు, ఎన్.రాజేష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ టి.త్రినాథ్, ఎస్‌బీ సీఐ జి.రాంబాబు, సీహెచ్ రుద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేయడం ఇలా..

మొబైల్ పోగొట్టుకున్న బాధితులకు వీజెడ్ ఎమ్‌మొబైల్‌ట్రాకర్ డాట్ ఇన్ వెబ్‌పోర్టల్ ఓ వరం. వెబ్‌పోర్టల్‌ను ఓపెన్ చేశాక రిపోర్ట్ కంప్‌లైంట్ ఆప్షన్ క్లిక్ చేస్తే, లోపల రిపోర్ట్ కంప్‌లైంట్ బాక్స్ ఓపెన్ అవుతుంది. అందులో పేరు, కాంటాక్టు నంబర్, ఐఎంఈఐ నంబర్లు, జిల్లా, గ్రామం, ఎక్కడ పోగొట్టుకున్నది, ఫోన్ మోడల్ తదితర వివరాలు నమోదుచేసి సబ్‌మిట్ చేస్తే సరిపోతుంది. కొద్దిరోజుల తర్వాత ఫిర్యాదు స్టేటస్‌ను చెక్ చేసుకునే ఆప్షన్ కూడా ఉంది. రికవరీ అయిన తర్వాత బాధితులిచ్చిన కాంటాక్టు నంబర్‌కు సమాచారం అందుతుంది.



విజయనగరం పోలీస్ వెబ్‌పోర్టల్

అందరికీ అందుబాటులో వెబ్‌పోర్టల్



వెబ్‌పోర్టల్ విజయనగరం వాసులందరికీ అందుబాటులో ఉండేలా రూపకల్పన చేశాం. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో సెల్‌ఫోన్ బాధితులు నేరుగా ఫిర్యాదుచేసేందుకు వెబ్‌పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చాం. పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా ఫిర్యాదు చేసుకోవచ్చు.
– ప్రొఫెసర్ నేతాజీ, వెబ్‌పోర్టల్ ఇన్‌చార్జి, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, దువ్వాడ

చాలా ఆనందంగా ఉంది



వెబ్‌పోర్టల్ రూపకల్పనలో భాగస్వామ్యం కావడం చాలా ఆనందంగా ఉంది. వెబ్ రూపకల్పనకు విజ్ఞాన్ యాజమాన్యం అహర్నిశలు శ్రమించింది. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో చాలా తొందరగా వెబ్‌ను రూపొందించి, విజయనగరవాసులకు అందించగలిగాం.
– అదారి దీపిక, ఐటీ విభాగం, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల



బాధితులకు మొబైల్స్ అందజేస్తున్న పోలీస్ అధికారులు

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విజయనగరం క్రైమ్: సుమారు 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ వెంకటరావు గురువారం తెలిపారు. చికిత్స పొందుతూ మృతిచెందిన ఆ వ్యక్తి బంధువులు ఎవరైనా గుర్తు పడితే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వేడి నీళ్లు పడి చిన్నారి మృతి

లక్కవరపుకోట: మండలంలోని గనివాడ పంచాయతీ శివారు నిడుగట్టు గ్రామానికి చెందిన రెండున్నర సంవత్సరాల చిన్నారి నొడగల సంజన వేడినీళ్లు శరీరంపై పడడంతో తీవ్రంగా కాలిపోయి గురువారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనకు సంబందించి ఎస్సై ఎం.ముకుందరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతి చెందిన చిన్నారి సంజన తల్లి నొడగల మాధవి ఈ నెల 16వ తేదీన ఇంటి దగ్గర కట్టెలపొయ్యిపై వేడినీళ్లు మరిగిస్తుండగా ఆక్కడే ఆడుకుంటున్న సంజన పొయ్యిలో గల కట్టెలను కాళ్లతో తన్నుకుని పడిపోయింది. దీంతో మరుగుతున్న వేడినీళ్లు పడడంతో శరీరం మొత్తం కాలిపోయింది.వెంటనే కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. తల్లి మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు

విజయనగరం ఫూల్‌బాగ్: ఈ నెలలో జరగనున్న డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండవ సెమిస్టర్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ కె.వెంకటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020-22 బ్యాచ్ విద్యార్థులు వారి హాల్‌టిక్కెట్లను డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.బీఎస్ఈ.ఏపీ.జీటీవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గడ్డి మందు తాగి వ్యక్తికి అస్వస్థత



అస్వస్థతకు గురైన ప్రసాద్

పార్వతీపురంటౌన్: గడ్డిమందు తాగిన ఓ వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. గురువారం జరిగిన సంఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం సిమిలిగుడ పంచాయతీ తాడికీల గ్రామానికి చెందిన మీనక ప్రసాద్ గ్రామంలో స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని సంవత్సరాలనుంచి ప్రసాద్‌కు ఫిట్స్ జబ్బు ఉంది. దీంతో పాటు తాగుడుకు అలవాటు పడ్డాడు. గురువారం ఉదయం ఫిట్స్ వచ్చి ఏదేదో మాట్లాడుతూ పిచ్చిగా ప్రవర్తిస్తూ ఇంట్లో ఉన్న గడ్డి మందు తీసుకుని ఇంటి వెనక్కి వెళ్లి తాగాడు. వెంటనే కింద పడిపోవడంతో గమనించిన భార్య జ్యోతి గుమ్మలక్ష్మీపురం పీహెచ్‌సీకి తీసుకువెళ్లి చేర్చగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించారు.

ఈదురు గాలుల బీభత్సం



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఈ మేరకు విద్యుత్ సిబ్బంది హుటాహుటిన స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 445.00
విజయనగరం	రూ. 449.00
శ్రీకాకుళం	రూ. 449.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,530-00
బంగారం(22సి. 10గ్రా.)	48,150-00
వెండి (కిలో)	64,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹103	₹176	₹ 186


ప్రతి చిత్రం.. ఓ తీపి గుర్తు





అపురూప అలల సవ్వడిని మదినింపే చిత్రం

గతమంతా తోలుబొమ్మలాడిన తెర..వర్తమానం కన్నులు గప్పిన పొర..మది నిండా ఎన్నెన్నో తీపి జ్ఞాపకాలు..మరెన్నో విషాదాలు..అన్నింటినీ గుర్తు చేస్తున్న చిత్రం అందరికీ ఓ వరం..అజరామరం. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం.





ఆకాశంలో మూగజీవాల నివాస గూడును బంధించిన కెమెరా


- ఒక్క క్లిక్ జ్ఞాపకాల సమాహారం
- అపూరూప దృశ్యాల విపంచిక కెమెరా
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



రెప్పపాటు చిత్రమిది..వంగర మండలం రుషింగి వంతెన వద్ద చిత్రీకరించిన మెరుపు



ఆటలపై మక్కువను తలపిస్తున్న చిత్రం



పశువులపై ఎక్కి అక్షరాలు దిద్దుతున్న చిన్నారి

వంగర/రాజాం సిటీ: వందమాటల వినే కన్నా ఒక్క చిత్రం చెప్పే సమాధానం ఎంతో విలువైనది. ఎన్నో అనుమానాలు..అపోహలను నివృత్తి చేసే సాక్ష్యం చిత్రం. సందర్భం ఏదైనా అన్ని వేడుకలను తనలో నింపుకుని మధుర స్మృతులను కళ్లకు చూపించే ఏకైక వస్తువు కెమెరా. మారుతున్న కాలనుగుణంగా ఎన్ని హంగులు ఆర్భాటాలు సంభవిస్తున్నప్పటికీ కెమెరాకు ఉన్న గుర్తింపు చెరిపేయలేనిది. కొత్త తరానికి పాత తరం వారిని పరిచేయం చేయడంలో కెమెరాయే వారధి. అలనాటి జ్ఞాపకాలను అటు..ఇటు తరాల వారి మదిలో ముద్రించేదే చిత్రం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే నానుడి మనుషులకే కాదు పరికరాలకు వర్తిస్తుందనే చెప్పాలి. ఒకప్పుడు భారీ సరంజామాతో కూడుకున్న కెమెరా నేడు అరచేతిలో అద్భుతం సృష్టించే స్థాయికి చేరుకుంది. గగనరంగం నుంచి చిత్రరంగం వరకు..జన్మదినం నుంచి కర్మదినం వరకు..శుభ, అశుభ, రాజకీయ, కార్యక్రమాలతో పాటు అన్ని రంగాల తీపి జ్ఞాపకాలను తన మదిలో చిత్రించి చెరగని ముద్రగా నిలిచింది కెమెరా. నాడు వెలుగు ఆధారంగానే కెమెరాల్లో చిత్రాలను బంధించే వారు. నేడు వెలుగు, చీకటి ఏదైనా సరే చిత్రాలను అత్యద్భుతంగా రూపొందించే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది.

రెండు శతాబ్దాలుగా కాలానుగుణంగా మార్పులు

ఫ్రెంచ్ దేశానికి చెందిన జోసఫ్ నైసిఫోర్ నీప్సీ 1816లో స్వయంగా కెమెరాను రూపొందించారు. అనంతరం 1826-29 సంవత్సరాల మధ్య కాలంలో లూయిస్ డాగురేతో కలిసి జోసఫ్ పూర్తిస్థాయిలో కెమెరాను తయారుచేసి అందుబాటులోకి తెచ్చారు. అప్పట్లో 124 జి ఫిల్మ్‌పై చిత్రాలను ప్రింట్ వేసేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా 35 ఎంఎం ఫిల్మ్‌పై ఛాయాచిత్రాలను తీసి, ఆ ఫిల్మ్‌ను డార్క్‌రూమ్‌లో మెరుగులద్ది ఇచ్చేవారు. 1975లో స్టీవ్ శాసన్ అనే వ్యక్తి 23 సెకెన్లలో దృశ్యీకరించే డిజిటల్ కెమెరాను తయారుచేశారు. డిజిటల్ రంగంలో వచ్చిన సరికొత్త మార్పుగా దీనిని పేర్కొన్నారు. 1980వ దశకంలో కమర్షియల్ డిజిటల్ కెమెరా అందుబాటులోకి వచ్చింది. ఇదే కెమెరా మారుతున్న డిజిటల్ రంగానికి అనుగుణంగా సరికొత్త సొబగులను అందిపుచ్చుకుంది. 1930వ సంవత్సరంలో వీడియో కెమెరా అందుబాటులోకి రాగా 1980వ దశకంలో వీడియో కెమెరా వినియోగం విస్తరించింది. ప్రస్తుతం 5 డీ సిరీస్‌లో డిజిటల్ కెమెరాలు, 4కె సిరీస్‌లో వీడియో కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. వాటితో ఎంత దూరంలో ఉన్న చిత్రాన్నైనా మరింత స్పష్టంగా చిత్రీకరించవచ్చు. ఎత్తయిన ప్రదేశాల నుంచి సైతం ఫొటో, వీడియోలను చిత్రీకరించే అత్యాధునిక డ్రోన్ వంటి పరికరాలు అందుబాటులోకి వచ్చాయి.

శిక్షణ పొందితే విస్తృతంగా అవకాశాలు



ఫొటోగ్రాఫర్లు శిక్షణ తీసుకుంటే ఉపాధి పొందేందుకు ప్రస్తుతం అవకాశాలు ఉన్నాయి. వందలాది మంది ఫొటోగ్రాఫర్లు జిల్లావ్యాప్తంగా ఫొటోగ్రఫీ వృత్తిలో జీవనం సాగిస్తున్నారు. ఛాయాచిత్రాలు, ఫొటోలు, వీడియోల చిత్రీకరణ వంటి అంశాల్లో మెలకువతో కూడిన శిక్షణ అవసరం.

సుంకరపల్లి శ్రీనివాసరావు,
ఫొటోగ్రాఫర్, రాజాం

మద్యం బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

గంట్యాడ: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మండలంలోని బుడతనాపల్లి గ్రామ శివారుల్లో ఓ వ్యక్తి మద్యాన్ని తరలిస్తున్నాడని పోలీసులకు సమాచారం రావడంతో మాటు వేసి గ్రామ సమీపంలోని ఎర్ర చెరువులో పట్టుకుని 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె. కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.



వేపాడ: మద్యం సీసాలతో పట్టుబడిన నిందితుడితో ఎస్సై రాజేష్

రెండు గ్రామాల్లో మద్యం పట్టివేత

వేపాడ: మండలంలోని వల్లంపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు గ్రామాల్లో పోలీసులు గురువారం నిర్వహించిన దాడుల్లో మద్యం బాటిల్స్ పట్టుబడ్డాయి. ఇందుకు సంబంధించి ఎస్సై రాజేష్ అందించిన వివరాలి లా ఉన్నాయి. మండలంలోని ముకుందపురం గ్రామానికిచెందిన గోపిశెట్టి రాము ఎనిమిది మద్యం సీసాలు, అరిగిపాలెం గ్రామానికి చెందిన డి. అప్పారావు 12 మద్యం బాటిల్స్‌తో పట్టుబడటంతో వారిద్దరిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రభుత్వ ఐటీఐ, విజయనగరం

విజయనగరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, విజయనగరం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే తొలి విడత కౌన్సెలింగ్ పూర్తవగా, మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 17న నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఐటీఐలలో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 24లోగా ఐటీఐ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఒక ఐటీఐ కన్నా ఎక్కువగా, ఏ జిల్లాలోనైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు యూనిక్ సంఖ్యతో కూడిన కాపీని ఈ నెల 24 లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే వెల్డర్, ప్లంబర్, డ్రెస్ మేకింగ్, స్యూయింత్ టెక్నాలజీ, పెయింటర్, కార్పెంటర్ ట్రేడ్‌లకు 8వ తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 29న ప్రభుత్వ ఐటీఐలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 30న హాజరు కావాలని తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

విజయనగరం అర్బన్: ప్రతిభా పురస్కారాల కోసం యాదవ సామాజిక వర్గానికి చెందిన పదోతరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి ముచ్చి రామలింగస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 2022 విద్యాసంవత్సరంలో పదోతరగతి పరీక్ష రాసి 500కు పైబడి మార్కులు సాధించిన విద్యార్థులు పురస్కారానికి అర్హులని తెలిపారు. మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రాలను నేరుగా గాని, వాట్సాప్ ద్వారా గాని ఈ నెల 20వ తేదీలోగా పంపించాలని స్పష్టం చేశారు. పూర్తి వివరాల కోసం 9441189999, 9440988948 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి శ్రద్ధ

- మెడికల్ కళాశాల ప్రకటనపై ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన పార్వతీపురం మన్యం జిల్లాలో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణానికి రూ. 62.46కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అంతేకాకుండా జిల్లాలో వైద్య కళాశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని, పార్వతీపురం ప్రాంతంలో వైద్య కళాశాల నిర్మాణం వల్ల ఎటువంటి అత్యవసర పరిస్థితికైనా జిల్లా కేంద్రంలోనే వైద్య సేవలు లభించే అవకాశం కలుగుతుందన్నారు. వైద్య అవసరాల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టినందుకు పార్వతీపురం ప్రాంత వాసుల తరఫున ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

వైద్య కళాశాల ప్రకటన అభినందనీయం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లాకు వైద్య కళాశాలను ప్రకటించడం అభినందనీయమని మాజీ ఎంపీ డాక్టర్ పీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీలు, పేదలు అధిక సంఖ్యలో ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాకు వైద్యకళాశాల ఎంతో ఉపయుక్తమన్నారు. ఆరోగ్యసేవలు మెరుగుపడడమే కాకుండా ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశం లభిస్తుందన్నారు. ఆహార భద్రత, దీర్ఘకాలిక వ్యాధుల నివారణపై పరిశోధనలు జరిగి నాణ్యమైన సేవలు ప్రజలకు శీఘ్రంగా అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రాథమిక స్థాయినుంచి ఆధునిక వైద్యసేవలు అందించడం వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఈప్రాంత ప్రజానీకం తరపున ధన్యవాదాలు తెలిపారు.

మెడికల్ కళాశాల ప్రకటనపై హర్షం

పార్వతీపురం మన్యం జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ప్రకటించడం హర్షణీయమని గిరిజన సంక్షేమసంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ పాలక రంజిత్‌కుమార్ అన్నారు. బుధవారం జరిగిన వైద్య ఆరోగ్యశాఖ సమీక్షా సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడం అభినందనీయమన్నారు.

17 తులాల బంగారం చోరీ

బొబ్బిలి: పట్టణంలోని మహరాజు పేటలో నివాసం ఉంటున్న వి.మహేష్ ఇంట్లో 17 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు అందిందని రూరల్ సీఐ ఎస్.తిరుమల రావు విలేకరులకు గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఈనెల 5న మహేష్ హైదరాబద్ వెళ్లారని, తిరిగి ఈనెల 15న ఇంటికి వచ్చి చూడగా వెనుక తలుపు తెరచి ఉండడంతో అనుమానం వచ్చి చూసి బంగారు వస్తువులు పోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రగతి మార్గంలో ఆర్టీసీ

- మూడు నెలల్లో వెయ్యి కొత్త బస్సులు
- ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు



ఆర్టీసీ ఎం.డి ద్వారకా తిరుమల రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎం.డి సీహెచ్ ద్వారకా తిరుమలరావు

పార్వతీపురంటౌన్: ప్రయాణికులే మా దేవుళ్లని, ఆర్టీసీని ప్రగతి మార్గంలో నడిపిస్తున్నామని ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గురువారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజులుగా విజయనగరం, శ్రీకాకుళం, నూతనంగా ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిన తరువాత ఆదాయాన్ని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ముఖ్యంగా కోవిడ్ వల్ల నష్టాల్లోకి వెళ్లిన ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకువెళ్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు సేవలందించడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునేందుకు కార్గో సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీ ప్రభుత్వ పరమైన తరువాత కార్మికులు అన్న పదం తీసేశామని, వారిని ఉద్యోగులుగా పిలిచి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా చేశామన్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్, సూపర్ లగ్జరీ, నూతన బస్సులను మూడునెలల్లో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

బస్సుల రూపురేఖలు మార్పు

ఆర్టీసీ ఆదాయానికి గండి కొడుతున్న ప్రైవేట్ వాహనాల్లో ప్రజలు ప్రయాణించకుండా వెయ్యి వరకు నూతన హైర్ బస్సులను తీసుకువస్తామని తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా తిరుపతి ఎలక్ట్రికల్ బస్సుల సేవలను ప్రయాణికులకు విజయవంతంగా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. అలాగే రాష్ట్రమంతటా ఎలక్ట్రికల్ బస్సుల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధంచేసినట్లు తెలిపారు. ఆర్టీసీని ప్రగతి పథంలో పయనింపజేసేందుకు ఆర్టీసీకి సంబంధించి ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చి ఆదాయాన్ని పెంచుకునే దిశగా ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. త్వరలో ప్రయాణికులకు టికెట్లను ఈ పాస్ విధానం ద్వారా ఇచ్చే చర్యలు తీసుకున్నామన్నారు. ఈ-పాస్ విధానం ద్వారా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ల పనితీరు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో పనిచేసి సంస్థ ఆదాయాన్ని పెంచడమే కాకుండా లాభాల బాటలో పయనించేలా చూసే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఈడీఓ కేఎస్ బ్రహ్మానంద రెడ్డి, ఈడీ రవికుమార్, డీపీటీఓ టీవీఎస్ సుధాకర్, డీఎం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయానికి ఆర్టీసీ ఎం.డి

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రానికి విచ్చేసిన ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ఎస్పీ కార్యాలయానికి రావడంతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ క్యాంప్ కార్యాలయం, అతిథి గృహం, ఇతర పోలీసు భవనాలను ఆర్టీసీ ఎం.డి సందర్శించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిస్థితిని ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సుభాష్, ఎస్పీ సీఐ శ్రీనివాసరావు, సీఐ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆపరేషన్ థియేటర్ పనుల పరిశీలన



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలగా అవతరించనున్న కేంద్రాస్పత్రిలో త్వరలో అధునాతన ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రానుంది. సీఎస్ఆర్ నిధులు రూ. 2.5 కోట్లతో యునిటీడ్ వే సంస్థ మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తోంది. ఈ పనులను కలెక్టర్ ఎ. సూర్యకుమారి గురువారం పరిశీలించారు. ఏర్పాటు చేయనున్న పరికరాలు, వాటి పనితీరును ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు, సూపరింటిండెంట్ డాక్టర్ సీతారామరాజు, వైద్యులు వంశీకృష్ణ, ఫరీదుద్దీన్, శివకుమార్, గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే ప్రారంభం



పూసపాటిపాలెంలో సర్వేకు ఏర్పాట్లు చేస్తున్న రెవెన్యూ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని పూసపాటిపాలెం, బొర్రవానిపాలెం గ్రామాలలో సర్వేశాఖ ఎ.డి టి. త్రివిక్రమరావు, తహసీల్దార్ ఇమంది భాస్కరరావు ఆధ్వర్యంలో భూసర్వేను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా డ్రోన్ సహాయంతో పూసపాటిపాలెంలో గల 54 సర్వే నంబర్లకు సంబంధించి 302 ఎకరాలు, బొర్రవానిపాలెంలో గల 72 సర్వే నంబర్లలో గల 330 ఎకరాలను సర్వే చేయించారు. ఈ సందర్భంగా సర్వే శాఖ ఎ.డి త్రివిక్రమరావు మాట్లాడుతూ, రీ సర్వేతో ఏళ్లనాటి భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్వేయిర్ గణపతి, డీటీ లావణ్య, ఆర్ఐ సత్తిబాబు, వీఆర్ఓలు, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- పశు వైద్యాధికారులు కమలకుమారి, రామరాజు



గొల్లపేటలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశువైద్యాధికారి కమలకుమారి

భోగాపురం రూరల్: గొర్రెలు, మేకలపెంపకందారులు జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యాధికారులు వై.కమలకుమారి, యు.రామరాజు అన్నారు. సవరవిల్లి సచివాలయ పరిధిలో గొల్లపేట, కొంగవానిపాలెం గ్రామాల్లో నట్టల నివారణ మందు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో అన్ని రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఈ నెలాఖరు వరకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

క్యాడెట్లకు అభినందనలు



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరేడ్‌లో సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. ఈ మేరకు పరేడ్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లను గురువారం అభినందించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ, క్యాడెట్లు బి.చాణక్య ప్రతాప్, షేక్ మహమ్మద్ పరేడ్‌లో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.సాయిదేవమణి, ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, బి.ఉదయ్‌కిరణ్, ఎన్ఎస్ఎస్ అధికారి బి.సూరప్పనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉడా కాలనీలో చోరీ

విజయనగరం క్రైమ్: పట్టణంలోని ఉడా కాలనీ ఫేజ్ –4లో నివాసం ఉంటున్న పతివాడ రామకృష్ణ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుని ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గ్రామ దేవత పండగకు డెంకాడ వెళ్లిన రామకృష్ణ గురువారం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇళ్లంతా చిందరవందరగా ఉండడంతో పోలీసులను ఆశ్రయించాడు. ఇంట్లో ఉన్న నాలుగు కిలోల వెండి, తులం బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటిని ఒడిసిపట్టరా..!

- కొత్త నిర్మాణాల్లో ఊసే లేని ఇంకుడు గుంతల నిర్మాణం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు
- వృథాగా పోతున్న వర్షపు నీరు

విజయనగరం: ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్య నీరు చేరింది. నీరు బయటకు పోయేందుకు మార్గం లేకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. అదే కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల ఆవరణల్లో ఇంకుడు గుంతలు నిర్మించి ఉంటే ఈ పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు. వర్షపు నీటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరి పైనా ఉంది. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చేయాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం సూచిస్తున్నా.. పట్టణాల్లో మాత్రం ఎక్కడా అమలు కావడం లేదు. పురపాలికల్లో నిర్మిస్తున్న కొత్త ఇళ్లల్లో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం, వరద వచ్చే ప్రాంతాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టకపోవడంతో పట్టణాల్లోని రహదారులు జలమయం అవుతున్నాయి.

నిబంధనలకు నీళ్లు..

కొత్త ఇంటి నిర్మాణానికి కావాల్సిన అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటారు. అలా వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించాలి. నిర్మాణాలు కొనసాగే సమయంలో కూడా పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉంది. ఆ సమయంలో ప్రతి ఒక్క ఇంటికీ ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోవాలని ఇంటి యజమానులకు సూచించాలి. ముందు ఇంకుడు గుంత ఏర్పాటు చేస్తేనే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాల్సిన అధికారుల అలసత్వం కారణంగా మచ్చుకైన వాటి జాడ కానరావడం లేదు. గతంలో ఏర్పాటు చేసిన వాటి గురించి పట్టించుకోకపోవడంతో అవి పూడుకుపోయాయి. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పల్లెలు, పట్టణాల్లో సీసీ రహదారులు నిర్మించడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా వృథాగా పోతోంది. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఏడాదికి సగటున 600 నుంచి 700 వరకు భవన నిర్మాణాలకు అధికారులు అనుమతులు జారీ చేస్తుంటారు. వారి వద్ద నుంచి రూ. 4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు నిర్మాణ రుసుం వసూలు చేస్తుంటారు.



ఇంకుడు గుంత (ఫైల్)

మూడేళ్లలో ఇంకుడు గుంతల నిర్మాణానికి వసూలు చేసిన మొత్తం..

సంవత్సరం	వసూలు చేసిన మొత్తం
2019-20	రూ.3.78 లక్షలు
2020-21	రూ.3.39 లక్షలు
2021-22	రూ. 3.20 లక్షలు

ఇంజినీరింగ్ విభాగానికి నివేదించాం..



నగరంలో భవన నిర్మాణ అనుమతులు పొందిన వారి వద్ద నుంచి ఇంకుడు గుంతల నిర్మాణానికి డబ్బులు వసూలు చేశాం. ఏడాదికి సగటున రూ.3 లక్షలకు పైగానే వసూలు జరుగుతోంది. 2019లో ఇంకుడు గుంతల నిర్మాణానికి సంబంధించి ఇంజినీరింగ్ విభాగానికి నివేదించగా.. అప్పట్లో 100 గుంతల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. కోవిడ్ కారణంగా పనులు ప్రారంభించలేదు.

– అమ్మాజీరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్, విజయనగరం కార్పొరేషన్.

వీటితో పాటు ఇంకుడు గుంతల నిర్మాణానికి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1200 వరకు వసూలు చేస్తుంటారు. అయినప్పటికీ నిర్మాణాలు మాత్రం జరగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలను చైతన్యవంతం చేసి ఇంకుడు గుంతల నిర్మాణానికి సన్నద్ధం చేయాలి.

పొదుపు చర్యలిలా..

నీటి పొదుపునకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది. ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. వాటిని నిర్మించి వదిలేయకుండా వర్షపు నీరు వాటిలోకి వెళ్లేలా చూడాలి. గ్రామాల్లో, పట్టణాల్లో సీసీ రహదారుల నిర్మాణ సమయంలో ముందుగా ప్రణాళిక వేసుకుని వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా చూడాలి. ఇలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెరిగి నీటికొరత తీరుతుంది.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరభద్రస్వామి, తదితరులు

- ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించడమే కాకుండా వ్యక్తిగత సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 35వ డివిజన్ వీటీ అగ్రహారంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కొంతమంది స్థానిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హతలుండి ఇంకా సంక్షేమ పథకాలు మంజూరు కాకపోతే తెలియజేయాలని కోరారు. నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా లైటింగ్, కాలువలు, రహదారులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేసేందుకు 20 లక్షల రూపాయలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

సుపరిపాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రజలు చెప్పడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, డివిజన్ కార్పొరేటర్ శ్రీనివాసరావు, ఆర్య వైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు కుమ్మరగంటి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పీతల సుగుణ, తాత్రాజు సునీత, పైల భవానీ, గౌరీశంకర్, రెడ్డి మురళి, తదితరులు పాల్గొన్నారు.

శాకాహారం మేలు

విజయనగరం: శాకాహార ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జ్ డి. శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని కోట వద్ద శాకాహార ర్యాలీని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ శాకాహారులుగా మారి ఎక్కువ కాలం జీవించాలన్నారు. ధ్యాన సంపన్నులుగా మారి సమాజాన్ని తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కోట వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ మూడులాంతర్లు, గంటస్తంభం కూడలి, బాలాజీ జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు సాగింది. అనంతరం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న రెవెన్యూ కల్యాణ మంటపంలో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ వ్యవస్థాపకుడు దివంగత పత్రీజీ సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షుడు జె.రామారావు, సేవాదళ్ కార్యదర్శి రామకృష్ణరాజు, డి. కేశవరాజు, కె. లక్ష్మితో పాటు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి సొసైటీ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోట జంక్షన్ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ

పకడ్బందీగా భూ సర్వే



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఇతర అధికారులు

- సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్

విజయనగరం: నగరాలు, పట్టణ ప్రాంతాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం అమలులో భాగంగా భూ సర్వే ప్రక్రియ పకడ్బందీ ప్రణాళికతో విజయవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన విధివిధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోదాహరణగా వివరించారు. విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మధుసూదనరావు, అమ్మాజీరావు, ఈఈ కె.శ్రీనివాసరావు, సర్వేయర్ సింహాచలం, అడ్మిన్, ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులు, వీఆర్వోలతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పక్కా ప్రణాళికతో సర్వే నిర్వహించాలని డీఎంఏ ప్రవీణ్‌కుమార్ వివరించారు.

సీపీఐ మహాసభలు విజయవంతం చేయండి

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 26వ తేదీ నుంచి 28 వరకు విశాఖపట్నంలో నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం స్థానిక అమర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలతో పాటు మహిళలు, కార్మికులు, తదితరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీపీఐ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న మహాసభల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ వినతి

భోగాపురం: మండలంలోని కవులవాడ పంచాయతీ మరడపాలెం గ్రామానికి చెందిన 75 మంది కుటుంబాల వారు తమకు విమానాశ్రయ నిర్వాసిత కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. విమానాశ్రయ భూసేకరణ సమయంలో తమ భూములు, గృహాలను వదిలి బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు వలస వెళ్లిపోయామని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానన్నారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి



వార్డులో పర్యటిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: మెరుగైన పారిశుధ్య నిర్వహణకు పట్టణవాసులు సహకరించాలని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని పిలుపునిచ్చారు. పట్టణంలోని నాలుగో వార్డులో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందజేయాలని సూచించారు. అనంతరం తాగునీరు సక్రమంగా సరఫరా అవుతున్నదీ, లేనిదీ.. వలంటీర్లు అందుబాటులో ఉన్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఈ క్రాప్ నమోదుకు కృషి



శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణరాజు

నెల్లిమర్ల: రైతులు శతశాతం ఈ క్రాప్ నమోదు చేసుకునేలా వ్యవసాయ సహాయకులు, వీఆర్ఓలు కృషి చేయాలని తహసీల్దార్ కేవీ రమణరాజు ఆదేశించారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ –క్రాప్ నమోదు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పంటలు వేసిన ప్రతి రైతు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏఓ పూర్ణిమ, ఆర్ఐ ప్రసన్నకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 12 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం. సాంబశివరావు తెలిపారు. ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధి పిన్నింటి కిశోర్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరిగిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.రాజీసంతోష్, పి.సత్యనారాయణ, వి.బాజ్జి, డి.సన్యాసిరావు, ఎస్.నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసి చూపిస్తున్నాం..



పూర్తయిన రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నగర మేయర్

- ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 45, 46వ డివిజన్‌లలో సుమారు రూ.40 లక్షల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన పనులను ప్రారంభించారు. మూడు చోట్ల రహదారులు, కాలువ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయగా... చందకవీధిలో పూర్తయిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అవసరమైన చోట్ల రహదారులు, కాలువలు నిర్మించడంతో పాటు తమ పర్యటనలో తెలుసుకున్న ప్రజా సమస్యలను కూడా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. చందకవీధిలో ఏడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరగా తక్షణమే వాటి ఏర్పాటుకు అధికారులకు ఆదేశించామన్నారు. గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం ఎన్నికల సమయంలో ఖాళీ గొట్టాలను వేసి నీటిని విడుదల చేయలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశామని చెప్పారు.

కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, స్థానిక కార్పొరేటర్లు తాళ్లపూడి సంతోషికుమారి, బొద్దూరు గోవిందమ్మ, కో ఆప్షన్ సభ్యుడు రహీమ్, జోనల్ ఇన్‌చార్జ్‌లు దూబే, తమ్ము, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అప్పారావు, నాయకులు తాళ్లపూడి పండు, బొద్దూరు లక్ష్మణరావు, సత్యవతి, రమణ, పి. నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

చేపలను పరిశుభ్రంగా ఉంచాలి

- జిల్లా మత్స్యశాఖ అధికారి నిర్మలాకుమారి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నిర్మలాకుమారి

విజయనగరం ఫోర్ట్: విక్రయించే చేపలను పరిశుభ్రంగా ఉంచితే కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి కనబరుస్తారని జిల్లా మత్స్యశాఖాధికారి నేతల నిర్మలకుమారి అన్నారు. గురువారం స్థానిక యూత్ హాస్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా మత్స్యకారులకు క్యాప్టివ్ సీడ్ నర్సరీలలో చేప పిల్లల పెంపకం, పరిశుభ్రతపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేపలు పట్టిన తర్వాత నేరుగా విక్రయించుకుండా వాటిని శుభ్రపరిచిన తర్వాత విక్రయించుకోవాలన్నారు. పరిశుభ్రమైన నీటిలో చేప పిల్లలను పెంచాలన్నారు. కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి చాందిని, జి.వెంకటేశ్వరావు, సీహెచ్‌వీవీ ప్రసాదరావు, ఇరిగేషన్ ఏపీడీ ఎస్.రామారావు, సీహెచ్ షణ్ముకరావు, ఎం. తులసి, ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ దాసరి బంగారయ్య

భోగాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ దాసరి బంగారయ్య సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వెల్‌నెస్, రైతుభరోసా, సచివాలయ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ ఆర్.రాము, పీఆర్ జేఈ చంద్రునాయుడు, ఈఓపీఆర్డీ సురేష్, సచివాలయ ఇంజినీరింగ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు వేయాల్సిందే..



ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ జేడీ వైవీ రమణ

డెంకాడ: గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా నట్టల నివారణ మందు వేయించాలని పశు సంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వైవీ రమణ అన్నారు. మండలంలోని మోదవలస పంచాయతీ వల్లూరు గ్రామంలో మూగీ జీవాలకు నట్టల నివారణ మందు గురువారం వేశారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేడీ రమణ మాట్లాడుతూ, ఈనెల 30 వరకు మూగజీవాలకు నట్టల నివారణ మందు వేస్తామన్నారు. ఈ మందు వేయకపోతే పరాన్నజీవుల వల్ల మూగజీవాలకు హాని కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కనకల పోలమాంబ, ఎంపీటీసీ సభ్యురాలు బోని యువశ్వేత, రాష్ట్ర డైరెక్టర్ బోని అప్పలనాయుడు, ఉపసర్పంచ్ గంద్రేటి అప్పన్న, పశుసంవర్ధకశాఖ ఎ.డి రామచంద్రరరావు, భోగాపురం సహాయ సంచాలకుడు మహాపాత్రో, పశువైద్యులు సంతోష్, శ్రీకాంత్, గోవర్ధన్‌సాగర్, వీఎల్ మణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



చిన్నారులతో నగర మేయర్, డిప్యూటీ మేయర్

విజయనగరం: కుల,మతాలకతీతంగా స్నేహభావంతో మెలిగేలా విద్యార్థి దశ చైతన్యం కలిగించడం ఎంతైనా అభినందనీయమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అభిప్రాయపడ్డారు. కణపాక మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో గురువారం జరిగిన కృష్ణాష్టమి వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం చిన్నికృష్ణుల వేషధారణలో ఉన్న విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్, క్రిస్మస్, కృష్ణాష్టమి వంటి పర్వదినాలలో విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భిన్నత్వంలో ఏకత్వం తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు . కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

- సీఐ కేకేవీ విజయ్‌నాథ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌నాథ్

నెల్లిమర్ల రూరల్: సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ కేకేవీ విజయ్‌నాథ్ అన్నారు. మండలంలోని టొప్పడాంలో సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరికీ సెల్‌ఫోన్‌లు కీలకంగా మారాయన్నారు. కొంతమంది అపరిచిత వ్యక్తులు బ్యాంక్ ఖాతా, ఏటీఎం వివరాలు అడుగుతారని.. ఎవ్వరూ ఆ వివరాలు బయటవారికి చెప్పకూడదని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతిలో మోసాలకు పాల్పడుతున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ట్రాఫిక్ రూల్స్, లోన్‌యాప్ నిర్వాహకుల వేధింపులు, దిశ యాప్, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు లోటుపాట్లు లేకుండా క్యూలైన్లో ఎప్పటికప్పుడు అన్నపానీయాలను టీటీడీ అందించింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 83,880 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 38,710 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.5.86 కోట్లు వేశారు. దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది.

22న అంగప్రదక్షిణ టికెట్లు విడుదల

తిరుమల: సెప్టెంబర్ నెల అంగ ప్రదక్షిణం టోకెన్లకు సంబంధించి ఆన్‌లైన్ కోటాను టీటీడీ ఈ నెల 22న ఉదయం 9 గంటలకు విడుదల చేయనుంది. సెప్టెంబర్ నెలలో బ్రహ్మోత్సవ తేదీలైన 27–30 వరకు అంగప్రదక్షిణం టోకెన్లను రద్దు చేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి అందుకు అనుగుణంగా టికెట్లను బుక్ చేసుకోవాలని టీటీడీ కోరింది.

కడప పెద్ద దర్గాలో క్రీడాకారిణి లిఖితారెడ్డి



పెద్దదర్గాను దర్శించుకున్న లిఖితారెడ్డి తదితరులు

కడప కల్చరల్: ప్రసిద్ధ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రమైన కడప అమీన్‌పీర్ (పెద్ద) దర్గాలో గురువారం అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి లిఖితారెడ్డి ప్రార్థనలు నిర్వహించారు. ఆమె కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి దర్గా గురువులను దర్శించుకున్నారు. ముజావర్ అమీర్ వారికి దర్గాను దర్శింపజేసి దాని చరిత్ర, విశిష్టతలను గురించి వివరించారు. ప్రధాన గురువుల మజార్ వద్ద, ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద ప్రార్థనలు చేయించారు. దర్గా పక్షాన ఫాతెహా నిర్వహించి ప్రసాదాలను అందజేశారు.

తిరుమల చేరుకున్న సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ



సుప్రీంకోర్టు సీజేఐ ఎన్వీ రమణకు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల/రేణిగుంట (తిరుపతి) :తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథి గృహం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఎ.వి. ధర్మారెడ్డి, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. సీజేఐ వెంట తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయన్ కూడా ఉన్నారు. ఇక శుక్రవారం ఉదయం జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకుంటారు. అంతకుముందు.. రాత్రి 7.45గంటలకు హైదరాబాద్ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న సీజేఐకు సాదర స్వాగతం లభించింది. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ఏవీ రవీంద్రబాబు, దుప్పాల వెంకటరమణ, చక్రవర్తి విజయలక్ష్మి, తెలంగాణ హైకోర్టు జడ్జి కన్నెగంటి లలిత, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమారావు, తిరుపతి ఏడీజే వీర్రాజు, ఎయిర్‌పోర్ట్ సీఎస్‌ఓ రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ శుక్లా, తదితరులు స్వాగతం పలికారు. ఇక శుక్రవారం భూమన కరుణాకర్‌రెడ్డి నిర్వహించనున్న 'సత్య శోధన' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీజేఐ పాల్గొంటారు. అనంతరం హైదరాబాద్‌కు బయల్దేరుతారు.

కర్ణాటక సీఎం, మాజీ సీఎం రాక

మరోవైపు.. కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా శ్రీవారి దర్శనార్థం గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. జీఎంఆర్ అతిథి గృహంలో బసచేసిన వీరిని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి వారిని శాలువాతో సత్కరించారు.

టీటీడీకి 20వేల టన్నుల ప్రకృతి ఉత్పత్తులు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్

సాక్షి, అమరావతి : తిరుమల తిరుపతి దేవస్థానంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన 11 రకాల ఉత్పత్తులను ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా టీటీడీకి సరఫరా చేయనున్నట్లు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ తెలిపారు. వరి, కంది, మినుములు, మిరియాలు, పసుపు, ఆవాలు, బెల్లం, వేరుశనగ, శనగ, చింతపండు తదితర ఉత్పత్తులు 20వేల టన్నులు సరఫరా చేయనున్నట్టు చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ సాగు చేసే రైతుల నుంచి ఉత్పత్తులను సేకరించి, ప్రాసెస్ చేసే విషయంపై మార్కెటింగ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్న జిల్లా ప్రతినిధులకు విజయవాడలోని రైతు సాధికారసంస్థ భవనంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ గురువారం ముగిసింది. టీటీడీకి అవసరమయ్యే ప్రకృతి ఉత్పత్తులను అధిక విస్తీర్ణంలో సాగు చేసే క్లస్టర్లను మ్యాపింగ్ చేయడం, సీఎం యాప్‌లో రైతులను రిజిస్ట్రేషన్ చేయించడం, ఈ–క్రాప్ బుకింగ్‌లో వారి వివరాలు నమోదు చేయడం, ఒకే రకం ఉత్పత్తులను పండించే రైతులతో లోకల్ గ్రూపులను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన 11 రకాల ఉత్పత్తులను సేకరించి ప్రాసెస్ చేసి టీటీడీకి సరఫరా చేసే విషయంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. రైతు సాధికార సంస్థ సీఈవో బి.రామారావు, స్టేట్ మార్కెటింగ్ ఇన్‌చార్జి ప్రభాకర్, సర్టిఫికెట్ ఇన్‌చార్జ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే



ఎంపీ మోపిదేవి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు నుంచి అవార్డును అందుకుంటున్న సాక్షి ఫొటోగ్రాఫర్ వి.రూబెన్ బెసాలియల్

కృష్ణలంక(విజయవాడ తూర్పు) : ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం అకాడమీ 75వ ఆవిర్భావ దినోత్సవం, ప్రపంచ ఫొటోగ్రఫీ డే వేడుకలను విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 75 చిత్రాలతో ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి పాల్గొని ఫొటోగ్రఫీ పోటీల్లో విజేతలుగా నిలిచిన 75 మందికి ప్లాటినం జూబ్లీ ఇమేజ్ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వారిలో తొమ్మిది మంది 'సాక్షి' ఫొటోగ్రాఫర్లు ఉండగా, వి.రూబెన్ బెసాలియన్ (విజయవాడ), నడిపూడి కిషోర్ (విజయవాడ), ఎస్.లక్ష్మీపవన్(విజయవాడ), వడ్డే శ్రీనివాసులు (కర్నూలు), మహబూబ్ బాషా (అనంతపురం) అవార్డులను అందుకున్నారు. రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ సాధించిన అకాడమీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డిని సన్మానించారు. ముకేష్ పర్వియాని, కె.విశ్వేందర్‌రెడ్డికి లివింగ్ లెజెండ్ అవార్డులు ప్రదానం చేశారు.

● తెలంగాణ

టీఆర్‌ఎస్ నేత హత్య కేసులో ఆరుగురి అరెస్ట్?

ఖమ్మం రూరల్: సంచలనం సృష్టించిన టీఆర్‌ఎస్ నేత తమ్మినేని కృష్ణయ్య హత్య కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు రాజమండ్రి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో అరెస్ట్ చేసినట్లు తెలిసింది. ఖమ్మం జిల్లా తెల్దారుపల్లి శివారులో ఈ నెల 15న జరిగిన హత్యను పోలీసులు సవాల్‌గా తీసుకొని నిందితుల ఆచూకీ కోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హత్య అనంతరం నిందితులు ఏపీకి పారిపోయినట్లు సమాచారం. ఈ విషయాన్ని పసిగట్టిన ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసులు.. నిందితులు తలదాచుకున్న ప్రాంతాలను గుర్తించి అరెస్ట్ చేశారని తెలిసింది. వారిని గురువారం ఖమ్మం తీసుకొచ్చినట్లు సమాచారం.

తింగరోడు పప్పు కూడా సీఎంను విమర్శిస్తాడా?

- నారా లోకేశ్‌పై మంత్రి ఆర్కే రోజా ధ్వజం



శ్రీవారిని దర్శించుకున్న మంత్రి ఆర్.కె.రోజా

తిరుమల : 'తింగరోడు పప్పు కూడా సీఎంను విమర్శించే వాడా?' అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా మండిపడ్డారు. తిరుమలలో గురువారం శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల ఆమె మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ సుపరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేసి, పారదర్శక పాలన అందిస్తున్నారని.. సర్వేలు ఏం చెప్పినా, మళ్లీ గెలుపు మాత్రం సీఎం జగన్‌దేనని స్పష్టం చేశారు. సీఎం ఏ పరిశ్రమ ప్రారంభించినా.. అది తాము తెచ్చిందేనంటూ లోకేశ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు పప్పును నమ్మే పరిస్థితి లేదని.. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో సీఎం జగన్ నంబర్ వన్‌గా నిలిచారని తెలిపారు. ఏటీసీ కంపెనీ ప్రతినిధులు సీఎం జగన్‌ను కొనియాడారని.. రాష్ట్ర ప్రభుత్వ సహకారం చాలా బాగుందని, తమ లాంటి వాళ్లకు ఏపీ సరైన వేదిక అని స్పష్టం చేశారని చెప్పారు. అదానీ, అంబానీ, అపాచీ.. తదితర సంస్థలెన్నో ఏపీలో పరిశ్రమలు పెడుతున్నాయని... ఇవన్నీ పప్పుకు కనబడటం లేదంటే ఐ హాస్పిటల్‌కు వెళ్లి చెకప్ చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కుప్పం, మంగళగిరిలో టీడీపీని పట్టించుకునే వారు ఎవరూ లేరన్నారు.

ద్రాక్ష తోటలో ముగ్గురు అనుమానాస్పద మృతి

అనంతపురంలో ఘటన

- ముగ్గురూ మహారాష్ట్ర వాసులే
- మహారాష్ట్రలో తయారైన మద్యం సేవించడం వల్లే మృతి చెందినట్టు ప్రాథమిక నిర్ధారణ

అనంతపురం క్రైం: మహారాష్ట్రకు చెందిన ముగ్గురు కూలీలు అనంతపురంలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఘటనా స్థలంలో కనిపించిన మహారాష్ట్రలో తయారైన ఖాళీ మద్యం సీసాలు, పొగాకు, గుట్కా ప్యాకెట్లు తదితరాలను బట్టి వాటిని తీసుకోవడం వల్లే చనిపోయి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారిస్తున్నారు. అనంతపురం డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం సమీపంలోని ఆలమూరుకు చెందిన రైతు రాజు ద్రాక్ష తోట సాగు చేస్తున్నాడు. అందులో పనిచేసేందుకు కాంట్రాక్టర్ల ద్వారా మహారాష్ట్రలోని సంగ్లి జిల్లా సవలాజ్ గ్రామానికి చెందిన భరత్ నామ్‌దేవ్ చావన్(42)ను ఏడాది క్రితం తీసుకువచ్చాడు. కాగా, భరత్ ఈ నెల 15న తన స్వస్థలానికే చెందిన దీపక్ జైసింగ్ షిరిటోడే (39), సదా (42) అనే వారిని తోటలో పని నిమిత్తం అనంతపురానికి తీసుకువచ్చాడు. ఈ ముగ్గురూ రోజు అక్కడే వండుకుని పనులు చేసుకునే వారు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో తోట యజమాని రాజు నిర్మాణంలో ఉన్న ఇంటి వద్దకు వెళ్లి చూడగా.. ముగ్గురు పడుకుని కనిపించారు. కాసేపు తర్వాత లేస్తారని భావించి వెళ్లిపోయిన రాజు మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో వచ్చి చూడగా.. భరత్ నామ్‌దేవ్ చావన్ అప్పటికే మరణించాడు. దీపక్ జైసింగ్ షిరిటోడే అపస్మారక స్థితిలో కనిపించాడు. అక్కడే ఉన్న సదాను పలకరించగా సరైన సమాధానం ఇవ్వకుండా.. నెమ్మదిగా మాట్లాడాడు. దీంతో అనుమానం వచ్చిన రాజు వెంటనే రూరల్ పోలీసులకు, 108కు సమాచారం అందించారు. దీపక్ ఆస్పత్రికి తరలించేలోగా అక్కడే మరణించగా.. సదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాతపడ్డాడు. డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీఐ విజయభాస్కర్‌గౌడ్, ఎస్‌ఐ నబీరసూల్ ఘటనా స్థలానికి చేరుకుని.. మహారాష్ట్రలోని థానేలో తయారైన 10 మద్యం ఖాళీ బాటిళ్లు, పొగాకు, ఖైనీ, గుట్కా, సున్నం, సాల్వెంట్ (ప్లాస్టిక్ పైపులను అతికించే ద్రావణం) లభించాయి. వాటిని సీజ్ చేసి మృతదేహాలను అనంతపురం సర్వజనాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

● తెలంగాణ

21న మునుగోడుకు అమిత్‌షా

బీజేపీలో చేరనున్న రాజగోపాల్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లా మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 21న బహిరంగసభ నిర్వహణకు బీజేపీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యాలయం అమిత్ షా పర్యటన షెడ్యూల్ జారీచేసింది. అమిత్ షా ఆదివారం మధ్యాహ్నం 1:20 గంటలకు బీఎస్‌ఎఫ్‌కు చెందిన ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3:40 గంటలకు హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 4:15 గంటలకు మునుగోడుకు వచ్చి, 4:25 గంటలకు సభాస్థలికి చేరుకుంటారు. 4:25 నుంచి 4:40 గంటల వరకు అక్కడే సీఆర్‌పీఎఫ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 4:40 నుంచి 6 గంటల వరకు సభలో పాల్గొంటారు. సమావేశానికి ముందుగా నిర్వహించే ర్యాలీలోనూ పాల్గొనే అవకాశం ఉంది. సాయంత్రం 6 గంటలకు సభాస్థలి నుంచి బయలుదేరి 6:05 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 6:10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 6:25 గంటలకు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. 6:30 గంటలకు బీఎస్‌ఎఫ్ ప్రత్యేక విమానంలో అక్కడి నుంచి ఢిల్లీకి వెళతారు. కాగా, అదే సభలో అమిత్ షా సమక్షంలో మునుగోడు మాజీఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీలో చేరనున్నారు.

'హెచ్‌ఆర్ పాలసీ అమలు కావాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో హెచ్‌ఆర్ పాలసీ అమలు కావాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సహకార శాఖ కమిషనర్ అహ్మద్ బాబు సంయుక్త కలెక్టర్లను ఆదేశించారు. ఎంపీఎస్‌సీ (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) గోడౌన్లు, హెచ్ ఆర్ పాలసీ తదితర అంశాలపై మార్కెటింగ్ శాఖ కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్నలతో కలసి గురువారం సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్న మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లు మరింత వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు ఉన్న చోట వాటిని త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. పీఏసీఎస్‌ల హెచ్‌ఆర్ పాలసీ, సిబ్బందికి శిక్షణ, సిబ్బంది నియామకం, బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలపై డీసీసీబీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ఈ వీడియో సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం.విజయ సునీత, జిల్లా సహకార అధికారి సుబ్బారావు, డిసిసిబి ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.వరప్రసాద్, మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని క్షీరాభిషేకం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి మూలవిరాట్టుకు గురువారం వేకువ జామున ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు. సింహ సంక్రమణం సందర్భంగా ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేకించి భక్తులు తెచ్చిన క్షీరంతో అభిషేకాలు చేపట్టారు. ఈవో వి.హరిసూర్యప్రకాష్ పాల్గొన్నారు.

సర్వం హరితమయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఊరులతో పాటు దారులను కూడా పచ్చగా మార్చేందుకు ప్రణాళికలు సాగుతున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టేందుకు డ్వామా యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాలో ఉద్యానవన పంటలను ప్రోత్సహించడంతో పాటు రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటి చల్లదనం పెంచేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నారు. ఏటా వానాకాలంలో వర్షాలు పడ్డాక ఈ పనులు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది రైతులు ఉద్యాన పంటలు పండించేందుకు ముందుకు రావడంతో మెరుగైన ఫలితాలు తీసుకువచ్చేందుకు డ్వామా అధికారులు కృషి చేస్తున్నారు. ఈ యేడు ఉద్యానవన పంటలకు రూ. 4.89 కోట్లు, ఎవెన్యూ ప్లాంటేషన్‌కి రూ.63.24 లక్షలు, ప్రత్యేక మునగ పంటకు రూ.29.21 లక్షలతో కలిపి రూ.5.81 కోట్లు వెచ్చించనున్నారు.

ఉద్యాన పంటలకు..

ఈ ఏడాది ఉద్యాన పంటల కోసం ఎక్కువ మొత్తంలో నిధులు వెచ్చిస్తున్నారు. వరి పండని ప్రాంతాలు, మెట్టు ప్రాంతాలు, ఉద్యాన పంటలకు అనువైన ప్రాంతాల్లో ఈ పంటలు వేస్తున్నారు. ప్రధానంగా కొబ్బరి, మామిడి, జీడి మామిడి వంటి మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది జిల్లాలోని 662.7 ఎకరాల్లో ఈ ఉద్యాన పంటలు వేయనున్నారు. ఇప్పటి వరకు 554.8 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు గోతులు తవ్వారు. కాగా 406 ఎకరాల్లో ఈ ప్లాంటేషన్ పూర్తయ్యింది. ఈ మొక్కలకు చుట్టూ కంచె, సాగు నీటిని అందించేందుకు నిధులు కేటాయించారు. ఒక ఎకరాకు రూ.74 వేలు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ మొక్కల సంరక్షణ మూడేళ్ల పాటు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. 662.7ఎకరాల్లో ఉద్యాన పంటలకు గాను రూ. 4.89కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

మునగకు ప్రత్యేక స్థానం

ఉద్యాన పంటలను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఏడాది ప్రత్యేకంగా జిల్లాలో అధిక మొత్తంలో మునగ పంటను పండించాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. ఈ క్రమంలో 39.48 ఎకరాల్లో ఈ పంటను వేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే 7 ఎకరాల్లో గోతులు తీశారు. మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎకరానికి రూ.74 వేలు వంతున ఖర్చు చేస్తున్నారు. ఇలా సగటున మునగ పంటకు గాను మూడేళ్ల నిర్వహణతో రూ.29.21 లక్షలు ఖర్చు చేయనున్నారు.



ఎవెన్యూ ప్లాంటేషన్‌కు..

జిల్లాలో 34 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఒక కిలోమీటరు పొడవుకు 400 మొక్కల వంతున మర్రి, కాగు, వేప, కానుగ వంటి నీడనిచ్చే మొక్కలను 13,600 లకు పైగా నాటనున్నారు. ఇప్పటికే జిల్లాలో 15.28 కిలోమీటర్ల మేర ఈ కార్యక్రమం పూర్తయ్యింది. రెండేళ్ల పాటు వీటి నిర్వహణకు కిలోమీటరుకు రూ.1.86 లక్షలు కేటాయించారు. ఈ ప్రకారం జిల్లాలో ఈ ఏడాది ఎవెన్యూ ప్లాంటేషన్‌కి గాను రూ.63.24 లక్షలు వెచ్చించనున్నారు.

నెలాఖరుకు పనులు పూర్తి చేస్తాం



జిల్లాలో పెద్ద ఎత్తున ఉద్యానవన మొక్కల సాగు, ఎవెన్యూ ప్లాంటేషన్ చేస్తున్నాం. ఇప్పటికే ఉద్యాన పంటల పని 80 శాతం పూర్తయ్యింది. ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రైతులు లాభసాటిగా ఉండేందుకు గాను ఈ ఏడాది మునగ పంటను ఉద్యాన పంటలతో పండిస్తున్నాం. ఈ నెలాఖరు నాటికి ఈ ప్లాంటేషన్ పూర్తి కానుంది.

– జీవీ చిట్టిరాజు డ్వామా పీడీ, శ్రీకాకుళం

ధార్మిక పరిషత్‌లోకి నాలుగు ఆలయాలు



ధార్మిక పరిషత్ పరిధిలో చేరిన పాతపట్నం అమ్మవారి ఆలయం

అరసవల్లి: దేవదాయ శాఖలో ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని అమలు చేసింది. సుమారు పదేళ్ల తర్వాత 21 మంది సభ్యులతో మళ్లీ ధార్మిక పరిషత్‌ను పటిష్టంగా ఏర్పాటు చేసింది. దీంతో వార్షికాదాయం రూ.25 లక్షల నుంచి రూ.కోటిలోపల ఉన్న దేవదాయ శాఖ పరిధిలో ఉండే ఆలయాలు, మఠాలు, సత్రాలు, ఇతర హిందూ ధార్మిక సంస్థలన్నీ ఈ ధార్మిక పరిషత్ పరిధిలోకి రానున్నాయి. దీంతో ప్రధాన ఆలయాల్లో ప్రభుత్వ పరంగా తీసుకునే విధాన పరమైన నిర్ణయాల్లో అత్యంత కీలకంగా ఈ పరిషత్ వ్యవహరించనుంది. ఈ నిబంధనల మేరకు జిల్లాలోని శ్రీకూర్మనాథ స్వామి ఆలయం, రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయం, పాతపట్నం నీలమణి దుర్గ ఆలయం, కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయం ఈ ధార్మిక పరిషత్ పరిధిలోకి చేరాయి. వరుసగా మూడేళ్లు వార్షికాదాయం రూ.25 లక్షలు దాటితే ధార్మిక పరిషత్ పరిధిలోకి ఆలయాలు వెళ్తాయి. ఈ లెక్కన శ్రీముఖలింగం ఆలయం కూడా త్వరలోనే ఈ జాబితాలోకి చేరనుంది.

ధార్మిక పరిషత్‌లోకి వెళ్లాక ఆలయాల అభివృద్ధికి నిధులు, వ్యయం, తదితర కీలక నిర్ణయాల్లో పరిషత్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఇందుకోసం పరిషత్ ఆధ్వర్యంలోనే పాలక మండళ్లు కూడా ఏర్పాటు చేస్తారు. శ్రీకూర్మం, కోటబొమ్మాళిలో ప్రస్తుతానికి పాలకమండళ్ల పదవీ కాలం ముగియలేదు. అయితే పాతపట్నం, రావివలసల్లో కొత్త పాలక మండలిని నియమించాల్సి ఉంది. ఈ బాధ్యతలన్నీ పరిషత్ ఆధ్వర్యంలోనే జరగనున్నాయి.

బాధ్యతలపై స్పష్టమైన ఆదేశాలు



ధార్మిక పరిషత్ పరిధిలో జిల్లాలోని నాలుగు దేవాలయాలు చేరాయి. ఇక మీదట ఇక్కడ పాలనాపరంగా విధాన పరమైన నిర్ణయాలన్నీ ధార్మిక పరిషత్ తీసుకోనుంది. బాధ్యతలపై స్పష్టమైన ఆదేశాలున్నాయి. త్వరలో రెండు ఆలయాలకు ట్రస్ట్ బోర్డులను వేయనున్నారు. అలాగే వరుసగా మూడేళ్లు రూ.25 లక్షలకు మించి ఆదాయం వచ్చిన ఆలయాలను ఈ పరిషత్ పరిధిలో చూపిస్తాం.

– టి.అన్నపూర్ణ, జిల్లా దేవదాయ శాఖాధికారి

రిమ్స్‌లో ఎంసీఐ బృందం పరిశీలన



కంప్యూటర్‌లో వైద్యులు, అధ్యాపకుల, ఉద్యోగుల వివరాలను చూస్తున్న ఎంసీఐ బృంద సభ్యులు



కళాశాలలో తరగతి గదులు పరికరాల పరిశీలన వెళ్తున్న ఎంసీఐ సభ్యులు

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలోని రిమ్స్ కళాశాలలో ఎంసీఐ బృందం సభ్యులు గురువారం పరిశీలన జరిపారు. ఏడుగురు సభ్యుల బృందం ఉదయం 9 గంటల సమయంలో రిమ్స్‌కు చేరుకున్నారు. రాత్రి 10 గంటల వరకూ ఏడు విభాగాలను పరిశీలించారు. మొత్తం 13 విభాగాల్లో 85 సీట్లకు రిమ్స్ అధికారులు ప్రతిపాదనలు పంపించగా, గురువారం ఏడు విభాగాల పరిశీలనకు ఎంసీఐ సభ్యులు వచ్చారు. సోమవారం మిగిలిన ఆరు విభాగాల పరిశీలనకు సభ్యులు వచ్చే అవకాశముంది. గురువారం సర్జరీ, ఈఎన్‌టీ, మైక్రో బయాలజీ, ఫార్మాకాలజీ, రేడియాలజీ, పల్మనాలజీ, గైనిక్ విభాగాలను పరిశీలించారు. బోధన సభ్యులు, పరికరాలు, వార్డులు, రోగులు సంఖ్య, అందుతున్న వైద్యం తదితర వివరాలను క్షుణ్ణంగా రికార్డుల ద్వారా తెలుసుకోవడమే కాకుండా అణువణువు పరిశీలన జరిపారు. విద్యార్థులు, వైద్యుల నుంచి కూడా వివరాలను సేకరించారు.

ఆరు విభాగాలపై సంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. పల్మనాలజీ విభాగానికి ప్రొఫెసర్ స్థాయి అధికారి లేరని తెలుసు కున్న ఎంసీఐ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రిన్సిపాల్ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల్లో నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
- పోలాకి, టెక్కలికి చెందిన ఇద్దరు దళారుల దందా

టెక్కలి రూరల్: పత్రికల్లో వార్తలు వస్తున్నా, సోషల్ మీడియాల్లో ప్రకటనలు కనిపిస్తున్నా..నిరుద్యోగులు మోసపోవడం ఆగడం లేదు. ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారి తీరు కూడా మారడం లేదు. తాజాగా టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల్లో పలువురు ఉద్యోగం కోసం రూ. లక్షల్లో డబ్బు ఇచ్చి మోసపోయిన వైనం వెలుగు చూసింది. పోలాకి, టెక్కలి మండలాలకు చెందిన ఇద్దరు దళారులు ఈ దందా సాగించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు..


పోలాకి మండలం బొద్దంగి పంచాయతీ పరిధి ఇలపండు పేట గ్రామానికి చెందిన ఇలపండ వేణుగోపాల్ అనే వ్యక్తి టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన బగా ది బాలకృష్ణ అనే రిటైర్డ్ ఆర్మీ వ్యక్తితో పరిచయం పెంచుకున్నారు. తనకు కొందరు రాజకీయ నాయకులు, రిటైర్డ్ డీజీపీ లు తెలుసని, ఎవరైనా ఉంటే వారికి హోంగార్డు ఉద్యోగాలు ఇప్పిస్తానని వేణు నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన బాలకృష్ణ నందిగాం మండలం పెద్ద లౌనుపల్లి గ్రామానికి చెందిన వంజంగి లోకనాథం, కిల్లి కూర్మారావు అనే ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.14 లక్షలు వసూలు చేసి అతనికి ఇచ్చా డు. కిల్లి కూర్మారావు అనే వ్యక్తి లట్టిగాం గ్రామానికి చెందిన ఎం.మనోజ్ అనే మరొకరితో కూడా రూ.6లక్షలు కట్టించాడు. వీరి నుంచి డబ్బులు తీసుకోవడమే కాకుండా ప్రా సెసింగ్ ఫీజు అని చెప్పి బాలకృష్ణ వద్ద నుంచి కూడా రెండున్నర తులాల బంగారు గొలుసును వేణు తీసుకున్నాడు. అయితే డబ్బులు తీసుకుని ఎన్ని రోజులవుతున్నా ఉద్యోగాలు రాకపోవడంతో వారు మోసపోయామని గ్రహించారు. అప్పటి నుంచి వేణు బాధితుల ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయడం మానేశారు. పోలీసులకు చెబితే వారి కంటే పై అధికారులతో ఫోన్‌లు చేయించి బెదిరిస్తున్నాడని బాధితులు వాపోతున్నా రు. డబ్బులు ఇచ్చేటప్పుడు అప్పు ఇచ్చినట్లు చూపిస్తూ రూ.20 స్టాంప్ పేపర్‌పై సంతకాలు తీసుకున్నాడని చెబుతున్నారు. ఇప్పటికే వేణుపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నట్లు వారు తెలిపారు.

తనకు పోలీసు అధికారులతో పరిచయాలు ఉన్నాయని, ఫిర్యాదు చేసినా ఫలితం ఉండదని చెబుతున్నాడని వారు పేర్కొంటున్నారు. అయితే టెక్కలికి చెందిన ఇద్దరు ప్రముఖ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కొంత కమిషనర్ తీసుకుని డబ్బులు ఇప్పిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఈ మోసంపై దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఫ్యాషన్

ఆభరణ మోహనం






రంగులలో చిత్రమై
సిల్వర్‌లో సింగారమై
దారాలతో జత కట్టి
బంగారంగా మెరిసిపోయే
కృష్ణ సౌందర్యాన్ని ఎన్ని వర్ణాల
రూపు కట్టినా తనివి తీరదు.
ఎన్ని విధాల వివరించినా
మాటలు చాలవు.
అందుకే ఆభరణాల డిజైన్‌లలో
ప్రేమాన్వితమై వేల కాంతులను
వెదజల్లుతున్నాడు.

టెంపుల్ జ్యువెలరీ

దేవతామూర్తుల ఆభరణాలలో రాధా కృష్ణుల రూపుతో ఉండే నెక్లెస్‌లు, హారాలు చూడగానే ముచ్చటగొలుపుతుంటాయి. నెమలి పింఛాల అందం, మురళీలోలుడుగా దర్శనమిచ్చే డిజైన్లు అన్నింటికన్నా ముందుంటాయి. అందుకు గోపికా వల్లభుడిలో ఉండే ఆకర్షణ అసలైన కారణం.






దారాల జతలు.. మట్టి కోటలు

రంగు రంగుల దారాలను ముడులు వేస్తూ, కృష్ణుడి పెండెంట్‌ను దానికి జత చేస్తే ఆ సింగారాన్ని చూడటానికి రెండు కళ్లూ సరిపోవనిపిస్తుంది. వీటికే కొన్ని గవ్వలు, కొన్ని మువ్వలు జత చేస్తే ఫ్యాషన్ జ్యువెలరీ అదుర్స్ అనిపించక మానదు. టెర్రకోట జ్యువెలరీలో కృష్ణుడు పెట్టని కోటలా హుందాగా మెరిసిపోతాడు.





పెయింటింగ్ చిత్రాలు

కృష్ణుడు ఉంటే రాధను వేరుగా చూపలేరు చిత్రకారులు. ఆ అందాన్ని ఫ్యాబ్రిక్, ఉడెన్.. మీద పెయింటింగ్‌గా కన్నయ్యను చిత్రించి, దండలలో కూర్చితే వెస్ట్రన్-ట్రెడిషన్ రెండు వేషధారణల్లోనూ సూపర్బ్ అనిపిస్తాడు.

చిహ్నాలూ సుందరమే

కృష్ణుడు రూపుతోనే ఆభరణాలను ధరించాలనేమీ లేదు. ఆ కిరీటి ధరించే నెమలి పింఛం, మురళి, గోవు .. చిహ్నాలు కూడా ఆభరణమై మగువుల మదిని దోచుకుంటున్నాయి. వీటితో ఎన్నో సృజనాత్మక ఆభరణాలు రూపు కడుతున్నాయి.

సిల్వర్ సింగారం

వెండి ఆభరణాలలో కృష్ణుడి రూపుతో డిజైన్ ఉంటే సంప్రదాయ వస్త్రాలకంరణే కాదు, పాశ్చాత్య దుస్తుల మీదకూ అందంగా నప్పుతాయి.

రోజుకు ఉన్నది ఇరవై నాలుగ్గంటలు.
పాతిక గంటలు చేసినా తరగనన్ని పనులు.
ఇదీ నేటి ఫాస్ట్ లైఫ్... బతుకు చిత్రం.
ప్రతి ఒక్కరికీ ఒత్తిడి పెరుగుతోంది.

మెదడు తన వంతుగా హెచ్చరిక చేస్తుంది.
గమనించే తీరిక ఉండదు మనిషికి.
ఊపిరి సలపనివ్వనన్ని పనులు.
ఆరోగ్యాన్ని హరిస్తున్న బిజీ లైఫ్‌లో
ధ్యాసతో ఊపిరి పీల్చమంటున్నారు అర్పిత.

శ్వాసపై ధ్యాస


అర్పితా కె గుప్తా

మోడరన్ లైఫ్‌లో మనిషి జీవితం... మానసికంగా ఒత్తిడికి లోనవుతున్నట్లు కూడా గమనించలేని స్థితిలోనే ఎక్కువ భాగం గడిచిపోతోంది. కొన్నిసార్లు సమస్య మానసికమైనదా, శారీరకమైనదా అనే స్పష్టత కూడా ఉండదు. డాక్టర్ దగ్గరకు వెళ్లి టెస్టులు చేయించుకుని మందులతో నయం చేసుకోవాల్సిన అనారోగ్యం కూడా చాలా సందర్భాల్లో ఉండదు. అలాగని మనశ్శాంతి కోసం ధార్మిక సత్సంగాలతో కాలం గడిపే విశ్రాంత జీవనమూ కాదు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో పరుగులు తీయక తప్పదు. ఈ పరిస్థితికి సమాధానం డివైన్ స్పేస్‌లో దొరుకుతోంది. ఒత్తిడుల మధ్య జీవిస్తూనే తేలికగా జీవించగలగడం ఎలాగో తెలిపే ఒక వేదిక ఇది... అంటున్నారు అర్పితా గుప్తా. విభిన్నమైన రంగాన్ని ఎంచుకుని సమాజహితం కోసం పని చేస్తున్న అర్పితా గుప్తా పరిచయం.

గాలి పీల్చడం తెలియాలి!

''సైకాలజీ, ఫిలాసఫీ, స్పిరిచువాలిటీ కలగలిసిన వేదిక ఇది. కెరీర్‌లో కొనసాగుతూనే వారానికో గంట సమయం కేటాయించుకోవడం అన్నమాట. మా నాన్న డాక్టర్, అమ్మ టీచర్. మా ఇంట్లో ఎవరూ ఈ ఫీల్డ్‌లో లేరు. అవుట్ ఆఫ్ ది బాక్స్ ఆలోచించడం అలవాటైంది నాకు. మొదటి నుంచి అలాగే ఉండేదాన్ని. పుట్టింది పెరిగింది హైదరాబాద్‌లోనే. ఇంటర్‌లో ఉన్నప్పుడు మా ఫ్రెండ్స్ కొంతమంది పార్ట్‌టైమ్ జాబ్‌లు చేయడం చూసి నేను కూడా ఒక ఇరిగేషన్ కంపెనీలో చేరాను. డిగ్రీ వరకు అంతే... చదువు ఉద్యోగం రెండూ. పెళ్లి తర్వాత చదువు, ఉద్యోగం రెండూ మానేసి ఇంట్లో ఉన్నాను. నాకు అది ఒక టర్నింగ్ పాయింట్. 1998–99 సంవత్సరాల్లో రేకీ సాధన ట్రెండింగ్‌లో ఉండేది. పక్కింటి ఆవిడ వెళ్తూ నన్ను పిలిచింది. ఆ ప్రాక్టీస్‌తో నా ఆలోచనా ధోరణి మారిపోయింది. త్రీ లెవెల్స్ వరకు ప్రాక్టీస్ చేసి మానేశాను. ఓ ఏడాది పాటు మళ్లీ గృహిణిగా, పిల్లల్ని పెంచుకుంటూ రొటీన్ లైఫ్. అయితే ఆ గ్యాప్‌లో ఫ్రెండ్స్, బంధువులు తలనొప్పి, మైగ్రేన్, డయాబెటిక్, ఎసిడిటీ వంటి సమస్యలకు రెమిడీ అడిగేవారు. శ్వాస తీసుకోవడం కరెక్ట్‌గా వస్తే జీవక్రియలన్నీ సక్రమంగా ఉంటాయి. గంట నుంచి ఒకటిన్నర గంట హీలింగ్ సెషన్ లో శ్వాస సాధన చేయించడమే వైద్యం. ఇంట్లో మూడు వారాలు ప్రాక్టీస్ చేస్తే ఇక అదే అలవాటయిపోతుంది. ఇలా మొదలైన సర్వీస్ ఆ తర్వాత చారిటబుల్ ట్రస్ట్‌గా రూపాంతరం చెందింది.

భయం కాదు... భరోసానివ్వాలి!

కొంతమందికి క్లోజ్‌డ్ లిఫ్ట్ అంటే భయం. బలవంతంగా తీసుకు వెళ్లినా కూడా ఊపిరాడనట్లు సతమతమవుతారు. ఇంట్లో వాళ్లు జాగ్రత్త కొద్దీ 'లిఫ్ట్‌లోకి వెళ్లకు, నీకు ఊపిరాడదు' అని భయపెడుతుంటారు. లిఫ్ట్‌లో ఏ ప్రమాదమూ రాదని ధైర్యం చెప్పాలి. వారిలో ఆ భయాన్ని పోగొట్టాలంటే ఆత్మీయంగా మాట్లాడాలి. మాటల్లో మాటలుగా ఎప్పటికో అసలు విషయం బయటపడుతుంది. చిన్నప్పుడు ఎప్పుడో తలుపులు, కిటికీలు మూసి ఉన్న గదిలో బంధీ అయి ఉక్కిరి బిక్కిరి కావడం వంటివేవో కారణాలు ఉంటాయి. ఒక పేషెంట్ కోసం గంట–రెండు గంటలు కేటాయించడం డాక్టర్‌లకు సాధ్యం అయ్యేపని కాదు. అంతేకాదు. ఇలాంటి ఫోబియాలున్న వాళ్లలో చాలామంది పేషెంట్ అనిపించుకోవడం ఇష్టం లేక డాక్టర్ దగ్గరకు వెళ్లరు. ఒక స్నేహితురాలిగా వాళ్లకు ఇష్టమైన టాపిక్ మాట్లాడుతూ వాళ్లంతట వాళ్లే ఓపెన్ అయ్యేలా చూడాలన్నమాట.

– అర్పితా కె గుప్తా,
చైర్ పర్సన్, డివైన్ స్పేస్ చారిటబుల్ ట్రస్ట్,
సైనిక్‌పురి, సికింద్రాబాద్

అవి బంధాలే- బంధనాలు కాదు!

ఇటీవల అమ్మాయిల్లో చాలా మంది పెళ్లంటే భయపడుతున్నారు. పెళ్లి చేసుకున్నప్పటికీ భర్తతో అన్యోన్యంగా ఉండలేకపోతున్నారు. బాల్యంలో సెక్సువల్ అబ్యూస్‌కి గురి కావడమే ప్రధాన కారణం అయి ఉంటుంది. మగవాళ్ల మీద ఏహ్య భావం పేరుకుపోయి ఉంటుంది. భర్తతో సరిగ్గా మెలగలేకపోతుంటారు. ఈ పరిస్థితులు అనేక అపార్థాలకు, విడాకులకు దారి తీస్తున్నాయి. ఆ అమ్మాయి ఓపెన్ అయ్యే వరకు ఆమెకు ఆలంబనగా నిలవాలి. మొదట తన దేహాన్ని తాను ప్రేమించుకునేటట్లు కౌన్సెలింగ్ ఇవ్వాలి. వైవాహిక జీవితాన్ని స్వాగతించడానికి మానసికంగా సిద్ధం చేయాల్సి ఉంటుంది. ఇక మధ్య వయసు గృహిణుల్లో... ఎంప్టీనెస్ట్ సిండ్రోమ్ చాలా పెద్ద సమస్య. ఆర్థిక సమస్యలు ఉండవు, ఆరోగ్య సమస్యలూ ఉండవు. ఏమీ తోచని స్థితి నుంచి దేహంలో ఏదో ఒక అనారోగ్యం ఉన్నట్లు భావిస్తుంటారు. పిల్లలు పెద్దయి చదువు, ఉద్యోగాలతో వేరే ప్రదేశాలకు వెళ్లిపోయిన తర్వాత ఇంట్లో భార్యాభర్తలు మాత్రమే మిగులుతారు. మగవాళ్లు దాదాపుగా రోజంతా బయట పనుల్లో నిమగ్నమై ఉంటారు. ఆడవాళ్లు ఇంట్లో రోజంతా ఒంటరిగా గడపలేక ఏదో కోల్పోయినట్లవుతారు. అలాంటి వాళ్లను 'మీకు ఏ కూర ఇష్టం' అంటే వెంటనే సమాధానం చెప్పలేరు. భర్త ఇష్టాలు, పిల్లల ఇష్టాలను టక్కున చెప్పేస్తుంటారు. తమకంటూ జీవితం ఉందనే వాస్తవాన్ని కూడా గ్రహించకుండా యాభైఏళ్లపాటు జీవించేసి ఉంటారు. సెల్ఫ్ లవ్ అనే భావనే ఉండదు వాళ్ల మనసులో. మన సమాజం ఆడవాళ్లను అలా పెంచేసింది మరి. అలాగే ఆఫీసుల్లో ఆడవాళ్లకు ఎమోషనల్ అబ్యూజ్ మరో రకమైన సమస్య. ఇవన్నీ ఇలా ఉంటే... అత్తగారి హోదా వచ్చేటప్పటికి విచిత్రంగా మారిపోతుంటారు. 'మేము వీకెండ్ సినిమాకు వెళ్తే మా అత్తగారు ఒప్పుకునే వారు కాదు. ఎంత బాధగా అనిపించేదో' అని గుర్తు చేసుకుంటూ తాను మాత్రం కోడలి విషయంలో అలా ఉండకూడదు... అని నిర్ధారించేసుకుంటారు. ఇక కోడలితో 'సండే సినిమాకు వెళ్లండి' అని పదే పదే చెబుతుంటారు. సినిమాకు వెళ్లాలని ఆ కోడలికి ఉందా లేదా అనే ఆలోచన ఉండదు. ఇలాంటి ఎన్నో సున్నితమైన సమస్యలకు పరిష్కారం తమంతట తాముగా తెలుసు కోగలిగినట్లు చేయడమే నా సర్వీస్. నేనిచ్చే పాతిక ప్రశ్నలకు సమాధానాలు నిజాయితీగా రాసుకుంటే చాలు... బంధాలు అనుబంధాలుగా ఉండాలి తప్ప బంధనాలుగా ఉండకూడదని వాళ్లే తెలుసుకుంటారు. కుటుంబ బంధాలు బలపడతాయి'' అని చెప్పారు అర్పితా గుప్తా.



– వాకా మంజులారెడ్డి
– ఫొటోలు: నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

వందే కృష్ణం ప్రియం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని
కృష్ణునికి ప్రియమైన అటుకులు, నెయ్యితో విభిన్న రకాల నైవేద్యాలను
సమర్పిద్దాం... రుచులను ఆస్వాదిద్దాం..

ప్రోటీన్ లడ్డు



కావలసినవి: **వెన్న** – టేబుల్ స్పూను, **జీడిపప్పు పలుకులు** – మూడు టేబుల్ స్పూన్లు, **కిస్‌మిస్** – మూడు టేబుల్ స్పూన్లు, **పచ్చికొబ్బరి తురుము** – ముప్పావు కప్పు, **బెల్లం తరుగు** – అరకప్పు, **అటుకులు** – రెండు కప్పులు, **యాలకులు** – ఆరు.

తయారీ: • జీడిపప్పు, కిస్‌మిస్‌లను వెన్నలో వేయించాలి. ఇవి వేగిన తరువాత కొబ్బరి తురుము వేసి దోరగా వేయించాలి • కొబ్బరి కూడా వేగాక బెల్లం వేయాలి • మరో బాణలిలో అటుకులను దోరగా వేయించి, యాలకులు వేసి మిక్సీజార్‌లో పొడిచేసి పెట్టుకోవాలి • బెల్లం కరిగిన తరువాత అటుకుల పొడి వేసి చక్కగా కలుపుకుని లడ్డులా చుట్టుకుంటే ప్రోటీన్ లడ్డు రెడీ.

పోహా కేసరి



కావలసినవి: **అటుకులు** – అరకప్పు, **నెయ్యి** – మూడున్నర టేబుల్ స్పూన్లు, **పంచదార** – అరకప్పు, **జీడిపప్పు పలుకులు** – టేబుల్ స్పూను, **కిస్‌మిస్** – పదిహేను, **ఫుడ్ కలర్** – చిటికెడు, **యాలకుల పొడి** – పావు టీస్పూను.

తయారీ: • అటుకులను దోరగా వేయించి రవ్వలా గ్రైండ్ చేసి పక్కన పెట్టుకోవాలి • టేబుల్ స్పూన్ నెయ్యిలో జీడిపప్పు, కిస్‌మిస్‌లను బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి • ఇదే బాణలిలో అటుకుల రవ్వను కూడా రెండు నిమిషాలపాటు వేయించాలి. తరువాత కప్పు నీళ్లు పోసి ఉండలు లేకుండా కలుపుతూ ఉడికించాలి • రవ్వ ఉడికిన తరువాత పంచదార, ఫుడ్ కలర్ వేసి మగ్గనివ్వాలి • పంచదార కరిగి మిశ్రమం దగ్గర పడినప్పుడు మిగిలిన నెయ్యి మొత్తం వేసి తిప్పాలి • నెయ్యి పైకి తేలేంత వరకు తిప్పుతూ ఉండాలి. నెయ్యి పైకి తేలిన తరువాత వేయించి పెట్టుకున్న జీడిపప్పు, కిస్‌మిస్‌లు, యాలకులపొడి వేసి తిప్పి దించేయాలి.

బాజిల్ బెల్లతరాయ్



కావలసినవి
అటుకులు – నాలుగు కప్పులు, **పచ్చి కొబ్బరి తురుము** – కప్పు, **బెల్లం తురుము** – అరకప్పు, **ఉప్పు** – చిటికెడు, **నెయ్యి** – టేబుల్ స్పూను, **నువ్వులు** – టేబుల్ స్పూను, **యాలకుల పొడి** – పావు టీస్పూను.

తయారీ: • ముందుగా అటుకులపై కొద్దిగా నీళ్లు చల్లుకుని తడిచేయాలి • ఒక గిన్నెలో బెల్లం తురుము, కొబ్బరి తురుము, యాలకులపొడి వేసి బాగా కలుపుకోవాలి. • ఇవన్నీ చక్కగా కలిపాక తడిచేసిన అటుకులు, నువ్వులు, నెయ్యి వేసి మరోసారి చేతితో అన్నీ బాగా కలిపి సర్వ్ చేసుకోవాలి.

అవల్ పుట్టు



కావలసినవి: **అటుకులు** – అరకప్పు, **బెల్లం** – అరకప్పు, **పచ్చికొబ్బరి తురుము** – రెండు టేబుల్ స్పూన్లు, **జీడిపప్పు పలుకులు** – ఆరు, **యాలకుల పొడి** – పావు టీస్పూను, **నెయ్యి** – రెండు టీస్పూన్లు, **ఉప్పు** – చిటికెడు.

తయారీ: • అటుకులను మూడు నిమిషాలపాటు రంగు మారకుండా దోరగా వేయించుకుని, చల్లారాక మిక్సీ జార్‌లో వేసి రవ్వలా గ్రైండ్ చేయాలి • రవ్వను వెడల్పాటి పాత్రలో పోసుకుని, చిటికెడు ఉప్పు వేసి కలపాలి. దీనిలో కొద్దికొద్దిగా వేడి నీళ్లు చల్లుతూ కలుపుకోవాలి. రవ్వ మరీ మెత్తగా కాకుండా గుప్పెట్లో పట్టుకుని వత్తితే ఉండయ్యేంత మెత్తగా కలిపి పదినిమిషాలు పక్కన పెట్టుకోవాలి • టీస్పూను నెయ్యిలో జీడిపప్పుని బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయించి పక్కనపెట్టుకోవాలి • ఇప్పుడు మందపాటి పాత్రలో బెల్లం, పావు కప్పు నీళ్లపోసి మరిగించాలి. బెల్లం కరిగిన వెంటనే ద్రావణాన్ని వడగట్టాలి • వడగట్టిన ద్రావణాన్ని ఉండపాకం రానివ్వాలి. పాకం రాగానే స్టవ్ ఆపేసి.. తడిపిపెట్టుకున్న అటుకుల రవ్వ వేసి తిప్పాలి • రవ్వను చక్కగా కలుపుకున్న తరువాత జీడిపప్పు, కొబ్బరి తురుము, మిగిలిన నెయ్యి వేసి అందంగా గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి.

ఆలూ – అటుకుల కచోరి



కావలసినవి: **అటుకులు** – కప్పు, **బ్రెడ్‌స్లైసులు** – నాలుగు, **ఉప్పు** – రుచికి సరిపడా, **మిరియాల పొడి** – టీస్పూను, **బంగాళ దుంప** – ఒకటి, **నిమ్మరసం** – టీస్పూను, **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా. **స్టఫింగ్: వేయించిన పల్లీలు** – కప్పు, **పచ్చిమిర్చి** – నాలుగు (సన్నగా తరగాలి), **అల్లం** – అంగుళం ముక్క (సన్నగా తురుముకోవాలి), **కారం** – టీస్పూను, **ఆమ్‌చూర్ పొడి** – టీస్పూను, **ఉప్పు** – రుచికి సరిపడా, **నిమ్మరసం** – టీస్పూను.

తయారీ: • ముందుగా అటుకులను కడిగి, ఐదునిమిషాలు నానబెట్టి నీటిని ఒంపేసి పక్కన పెట్టుకోవాలి • బంగాళ దుంపను ఉడికించి, తొక్కతీసి చిదుముకొని పక్కన పెట్టుకోవాలి • బ్రెడ్‌స్లైస్ అంచులను తీసేసి ముక్కలుగా తరగాలి • పెద్దగిన్నెలో అటుకులు, మిరియాల పొడి, చిదుముకున్న దుంప, బ్రెడ్‌స్లైస్ ముక్కలు వేసి కలపాలి • రుచికి సరిపడా ఉప్పు, నిమ్మరసం వేసి పిండిముద్దలా కలిపి పక్కన పెట్టుకోవాలి • స్టఫింగ్‌కోసం తీసుకున్న పదార్థాలన్నింటిని ఒక గిన్నెలో వేసి చక్కగా కలిపి పక్కన పెట్టుకోవాలి • పిండిముద్దను కావాల్సిన పరిమాణంలో ఉండలు చేసుకుని మధ్యలో స్టఫింగ్‌ను నింపి అంచుల నుంచి బయటకు రాకుండా కచోరీలా వత్తుకోవాలి • పిండి మొత్తాన్ని ఇలా వత్తుకున్న తరువాత కచోరీలను కరకరలాడుతూ, గోల్డెన్ కలర్‌లోకి మారేంత వరకు డీప్ ఫ్రై చేసి సర్వ్ చేసుకోవాలి.